బుధవారం 18 నవంబరు 2026 https://www.telugudesam.org



ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కోనసీమ గ్యాస్ లీకేజీపై సీఎం చంద్రబాబు ఆదేశాలు

తక్షణ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం

ఎట్టకేలకు లీకేజీని అదుపు చేసిన ప్రత్యేక బృందాలు


- వివరాలు 2 లో..

'అక్వాన్'పై అంతటా అప్రమత్తం


- రేపటికి తీవ్ర రూపం దాల్చనున్న తుఫాన్
- 20న నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 130 కి.మీ వేగంతో గాలులు
- కోస్తా జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచనలు
- 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సన్నద్ధం
- తీరప్రాంత జిల్లాలకు హైఅలర్ట్..

7

అక్వాన్ తుఫాన్‌పై సమీక్ష



- ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి
- విపత్తులకు భయపడాల్సిన అవసరం లేదు
- మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు
- రియల్ టైమ్‌లో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



అక్వాన్ తుఫాన్‌కు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మంగళవారం సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపుతూనే ఉండాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. చెట్లు కూలినా... విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా వెంటనే క్లియర్ చేసేలా పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. రియల్ టైమ్‌లో అంచనాలు వేస్తూ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని చెప్పారు.

3

వరుస తుఫాన్లతో నష్టం వాటిల్లింది...

తక్షణ సాయం అందించండి

- రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది
- రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయండి
- వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి సహకరించండి
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

2

ఏపీలో రెండు భారీ తుఫాన్లతో భారీ నష్టం సంభవించిం దని... రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయాన్ని అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మంగళవారం ఆమెతో భేటీ అయ్యారు. రెండు తుఫాన్ల వల్ల ప్రాథమిక అంచనా ప్రకారమే సుమారు రూ. 7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు చెప్పారు. కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటిం చాయని... వారు కూడా వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తా యని చెప్పారు. రాష్ట్రంలో విశాఖ, అమరావతి, తిరుపతి రీజియ న్ల వారీగా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్, విశాఖ ఎకనమిక్ రీజియన్ అభి వృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. అలాగే విశాఖ సీఐఐ సదస్సులో వచ్చిన పెట్టుబడుల వివరాలను వివరించారు.



పంచాయతీ నామినేషన్లలో వైసీపీ అరాచకాలు

- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన తెలుగుదేశం
- 500-600 మందితో జైలు వద్దకు వెళ్లిన పెద్దిరెడ్డి, సజ్జలపై చర్యలు తీసుకోవాలి
- ఆర్వోపై చేయి చేసుకున్న మాజీ ఎమ్మెల్యే రామ్‌ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి
- వేంపల్లి దాడి ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్
- వైసీపీ నామినేషన్లను ఎక్కడ అడ్డుకున్నారో చెప్పాలని జగన్‌కు వర్ల రామయ్య సవాల్

- వివరాలు 8 లో..

ఈవీఎంలైనా.. బ్యాలెట్‌లైనా.. ప్రజాతీర్పు కూటమికే అనుకూలం



- పంచాయతీ ఎన్నికల్లోనూ అదే ఐక్యత, స్ఫూర్తితో కూటమి విజయపరంపర కొనసాగాలి
- ట్రిపుల్ ఇంజిన్ పాలనతో గ్రామాల అభివృద్ధికి వేగం.. బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 3 లో..

సొంత చెల్లిని అవమానించే జగన్ రాజకీయాలకు అనర్హుడు



- మహిళా లోకానికి తక్షణమే క్షమాపణ చెప్పాలి
- ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత

8

4

మహిళ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రాతలా?

పెద్దలను పెళ్లికి పిలవడం సంస్కారం - సాక్షి కథనాన్ని ఖండించిన మంత్రి లోకేష్

వావి వరసలు తెలిసినోడు చేసే పనేనా?

- తండ్రి వయసున్న వ్యక్తికి శుభలేఖ అందిస్తే చెట్టాపట్టాల్ అంటూ రోత రాతలా?
- మనిషై పుడితే ఆడబిడ్డపై ఇలాంటి నిందలా?
- తల్లి, చెల్లి తేడా లేకుండా దిగజారుడుతనం జంతువు చేష్టలకు పరాకాష్ట.. అత్యంత నీచం
- మీరే దగ్గరుండి రాయించారా? జవాబు చెప్పాలి
- సంజాయిషీ మీరిస్తారా? మీ సాక్షితో ఇప్పిస్తారా?
- జగన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆగ్రహం



4



చైతన్యరథం

వరుస తుఫాన్లతో దెబ్బతిన్నాం...

తక్షణ సాయం అందించండి



- **రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది**
- **రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయండి**
- **వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి సహకరించండి**
- **ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి**

న్యూఢిల్లీ(చైతన్యరథం): ఏపీలో రెండు భారీ తుఫాన్ల తాకిడితో పంటలు సహా వివిధ రంగాలకు భారీ నష్టం సంభవించిందని... రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మంగళవారం నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, హార్టికల్చర్ హబ్, పూర్వోదయ నిధులు విడుదల, ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. అలాగే విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు, ఆ సదస్సు వేదికగా తీసుకున్న నిర్ణయాలపై భేటీలో ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్రాన్ని ఇటీవల కాలంలో తాకిన ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టం గురించి సీఎం చంద్రబాబు వివరించారు. ఈ రెండు తుఫాన్ల వల్ల ప్రాథమిక అంచనా ప్రకారమే సుమారు రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు చెప్పారు. తుఫాన్ ముప్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఎం వివరించారు. చేతికందే పంట నీటి పాలైందని ముఖ్యమంత్రి వివ రించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నా... రైతులను గట్టెక్కించేం దుకు పట్టిసీమ ద్వారా కొన్ని ప్రాంతాలకు సాగు నీరందిం చామని... కానీ తుఫాన్ల తాకిడితో పంటలు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. దీంతో పాటు తీర ప్రాంతంలో మౌలికవసతులు భారీఎత్తున దెబ్బతిన్నాయని... ముఖ్యంగా విద్యు త్ వ్యవస్థ ఎక్కువగా నష్టపోయిందని తెలిపారు. రాష్ట్రానికి తుఫాన్ల వల్ల కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని... వారు కూడా వీలైనంత త్వరలో నివేదిక సమ ర్పిస్తాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్షణ సాయం అందించగలిగితే కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని వివరించారు.

ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన భేటీలో రాష్ట్రంలో చేపడుతోన్న అభివృద్ధి ప్రణాళికల అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్ల వారీగా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు తెలిపారు. దీంట్లో భాగంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హార్టికల్చర్ హబ్‌లో భాగంగా వివిధ స్థాయిల్లో మౌలికవసతుల అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. గ్రామాలకు రోడ్ నెట్‌వర్క్, ఇరిగేషన్ అభివృద్ధి పనులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి మీద ఫోకస్ పెట్టామని తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. అలాగే విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృ ద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ శర వేగంగా అభివృద్ధి చెందుతోం దని... దీనికి ఇప్పటికే కేంద్రం నుంచి వివిధ మార్గాల్లో సహకా రం అందుతోందని.. దీనికి అదనంగా మరింత సాయం అందిం చగలిగితే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని వివరిం చారు. ఈ సందర్భంగా ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సు అంశం ప్రస్తావనకు వచ్చింది. రెండురోజుల పాటు జరిగిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వచ్చిన పెట్టుబడులు, వివిధ అంశాలపై జరిగిన చర్చల సారాంశాన్ని నిర్మలా సీతారామన్‌కు సీఎం వివరించారు. ఈ సదస్సు పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పా డేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు సహా ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **కోనసీమ గ్యాస్ లీకేజీపై సీఎం చంద్రబాబు ఆదేశాలు**
- **తక్షణ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం**
- **ఎట్టకేలకు లీకేజీని అదుపు చేసిన ప్రత్యేక బృందాలు**





అమరావతి(చైతన్యరథం): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ లీకేజీ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికా రులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ లీకేజీ ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశా లు జారీ చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్యాస్ లీకేజీని నియంత్రించేందుకు ఓఎన్జీసీ ప్రత్యేక సాంకేతిక బృందాలతో తక్షణ చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగు తున్న నేపథ్యంలో ఓఎన్జీసీ అధికారులను తక్షణం సంప్ర దించాలని అధికారులకు సూచనలు చేశారు. ఓఎన్జీసీ చైర్మన్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి భద్రతా చర్యలపై సమీక్షించాలని ఆదేశించారు. కోనసీమ జిల్లాలోని రాజోలు నియో జకవర్గం మామిడికుదురు మండలం నగరం గ్రామ పరిధిలోని తాడివారిమెరక వద్ద ఓఎన్జీసీ గ్యాస్ డ్రిల్లింగ్ బావి నుంచి భారీగా గ్యాస్ లీకేజీ అవుతోంది. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో పెద్ద శబ్దంతో ఒక్కసారిగా గ్యాస్ వెలువ డింది. భారీఎత్తున గ్యాస్ పైకి ఎగసిపడుతోంది. వెంటనే అప్రమ త్తమైన అధికారులు గ్యాస్ బావి చుట్టూ కిలోమీటరు పరిధిలోని నివాస ప్రాంతాల ప్రజలను ఇప్పటికే ఖాళీ చేయించారు. ఇప్పటివరకు ఎలాంటి మంటలు చెలరేగలేదని.. గ్యాస్ బావి ముఖద్వారం పటిష్ఠంగా ఉందన్న ఓఎన్జీసీ అధికారులు తెలిపారు. భూమికి సమీపంలో గ్యాస్ వ్యాపించకుండా ఓఎన్జీసీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాద నివారణలో భాగంగా డీజిల్ జనరేటర్లు, ఇతర పరికరాలను నిలిపివేసి సమీప ప్రాంతాల నుంచి తరలించారు. గ్యాస్ బావి లీకేజీని పూర్తిగా అరికట్టేందుకు సిమెం టింగ్ బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. ఓఎన్‌జీసీ గ్యాస్ డ్రిల్లింగ్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను ఎట్టకేలకు 10 గంటల పాటు శ్రమించిన ఓఎన్‌జీసీ నిపుణుల బృందం అదుపు లోకి తెచ్చింది. దీంతో సమీప గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఇంజినీరింగ్ కనీస ఫీజు పెంపునకు నిర్ణయం


- మంత్రి నారా లోకేష్‌కు అపెక్మా కృతజ్ఞతలు



అమరావతి (చైతన్యరథం): ఇంజినీరింగ్ కనీస ఫీజును రూ.40 వేల నుంచి రూ.47 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అపెక్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్) సంతోషం వ్యక్తం చేసింది. తాత్కాలిక ఫీజు పెంపుపై ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కాగా.. కొత్త బ్లాక్ పీరియడ్ (2026-29)కు సంబంధించిన పూర్తిస్థాయి ఫీజుల వివరాలను ప్రభుత్వం.. రాబోయే రెండు నెలల్లో ఖరారు చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు సుమారు రూ.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం నెలకు రూ.200 నుంచి రూ.250 కోట్లను ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేస్తోంది. కాగా.. నెలకు రూ. 400 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని అపెక్మా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి రూ.1,800 కోట్ల ప్రొసీడింగ్స్ జారీ కాగా, ఇప్పటివరకు రూ.1,000 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.800 కోట్లను రాబోయే 2-3 నెలల్లో క్లియర్ కాను న్నాయని అపెక్మా వెల్లడించింది. కాగా.. 2026-27 విద్యా సంవ త్సరం ఫీజుల్లో కనీసం 50 శాతం నిధులను ఈ ఆర్థిక సంవత్స రంలోనే చెల్లించాలని ప్రభుత్వానికి అపెక్మా విన్నవించుకుంది. విద్యార్థులకు నేరుగా అందాల్సిన ఎంటీఎఫ్ నిధులను కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. విద్యార్థుల సర్టిఫికెట్లు, అడ్మిషన్ల సమస్యలపై ఇంజనీరింగ్ కళాశాలలకు అపెక్మా కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఏ కళా శాల యాజమాన్యం నిలిపివేయవద్దని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చిన తర్వాత కూడా సర్టిఫికెట్ల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడితే అపెక్మాను సంప్రదించాలని విద్యార్థులకు సూచిం చింది. హాస్టల్, బస్సు ఫీజుల పేరుతో అడ్మిషన్లను అడ్డుకోవద్దని, కనీస ఫీజులతో ప్రవేశాలు కల్పించాలని కళాశాలలకు దిశా నిర్దేశం చేసింది. అడ్మిషన్ల ఆలస్యం కావడం, అటెండెన్స్ పోస్టింగ్ సమస్యలతో రీయింబర్స్‌మెంట్ అర్హత కోల్పోయిన విద్యార్థుల డేటాను క్రమబద్ధీకరించాలని కోరింది.

చైతన్యరథం

అక్వాన్ తుఫాన్‌పై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



- ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి
- విపత్తులకు భయపడాల్సిన అవసరం లేదు
- మత్స్యకారులు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు
- రియల్ టైమ్‌లో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలి
- పునరావాస చర్యలకు అధికారులకు ఆదేశం

అమరావతి(చైతన్యరథం): అక్వాన్ తుఫాన్ గమనంపై మంగళవారం సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గంటకు 3 కి.మీ వేగంతో తుఫాన్ కదులుతోందని, మంగళవారం సాయంత్రానికి తుఫాన్ తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని ఆర్టీజీఎస్ అధికా రులు వివరించారు. తీవ్ర తుఫానుగా మారే ప్రమాదముందని చెప్పారు. చెన్నైకి 610 కి.మీ, మచిలీపట్నానికి 660 కి.మీ, విశాఖపట్నానికి 670 కి.మీ, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కి.మీ దూరంలో ప్రస్తుతం తుఫాన్ కేంద్రీకృతమైందన్న వివ రించారు. అక్వాన్ తుఫాన్ కారణంగా 19, 20వ తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు. తుఫాన్ తీరం దాటే సమయంలో ఈదురుగాలులకు అవకాశముందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడు తూ ఇటీవల కాలంలో రాష్ట్రాన్ని మూడో తుఫాన్ తాకుతోంది. విపత్తులు వచ్చాయని భయపడాల్సిన అవసరం లేదు...వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ప్రజలకు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపుతూనే ఉండాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణవార్డు సిబ్బంది ద్వారా తుఫాన్ ప్రభావిత ప్రాం తాల్లోని ప్రజలకు నేరుగా సమాచారం అందించాలని సూచిం చారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంతటి పెద్ద విపత్తు సంభవించినా తమను ఆదుకోవడానికి ప్రభుత్వం, అధికారులు ఉన్నారనే భరో సా కల్పించాలి. చెట్లు కూలినా... విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా వెంటనే క్లియర్ చేసేలా పునరుద్ధరణ పనులు చేపట్టాలని తెలి పారు. రియల్ టైమ్‌లో అంచనాలు వేస్తూ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని చెప్పారు. తుఫాన్ కారణంగా చెరువులు, కాల్వలకు గండ్లు పడ కుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.

రైల్వే టెర్మినల్‌కు గ్రీన్ సిగ్నల్

- జగన్నాథపురంలో ఏర్పాటు
- 500 ఎకరాలు భూసేకరణ
- కేంద్ర మంత్రి ఆమోదం
- విశాఖ నుంచి బయలుదేరి తిరిగి వచ్చే ప్రధాన రైళ్లలో అత్యధికం టెర్మినల్‌కు తరలింపు



విశాఖపట్నం(చైతన్యరథం): రాష్ట్రానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంజూరుచేసిన రెండు రైల్వే టెర్మినల్స్‌లో ఒకటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏర్పాటుకానుంది. గత మూడేళ్లుగా దీని కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు సీఎం చంద్రబా బు డిమాండ్ మేరకు మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గొల్లలపాలెం పంచాయతీలో జగన్నాథ పురం గ్రామం ఉంది. విశాఖ నుంచి సుమారుగా 40 కి.మీ. దూరం. కొత్తవలస నుంచి అనకాపల్లి రెండు బైపాస్ లైన్లు వేయాలని మూడేళ్ల క్రితం ప్రతిపాదించారు. ఆ మార్గంలోనే ఈ జగన్నాథపురం ఉంది. అక్కడ భారీ రైల్వే కోచింగ్ యార్డు ఏర్పాటుచేయాలని మూడేళ్ల క్రితం సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారుచేసి కేంద్రానికి పంపారు. ఇప్పుడు అదే ప్రాంతంలో మెగా రైల్వే టెర్మినల్ ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది.

టెర్మినల్ అంటే ఏమిటి? ఏ సౌకర్యాలు ఉంటాయి?

రైల్వే స్టేషన్‌కు, రైల్వే టెర్మినల్‌కు చాలా తేడా ఉంది. ఏదైనా రైలు వచ్చి ప్రయాణికులను దించేసి అక్కడ మరికొంతమందిని ఎక్కించుకుని ఆ మార్గంలో ముందుకు వెళ్లిపోతే...ఆ ప్రాంతాన్ని రైల్వేస్టేషన్‌గా వ్యవహరిస్తారు. ఏదైనా రైలు వచ్చి అక్కడే ఆగిపోయి ముందుకు వెళ్లడానికి అవకాశం లేకుండా తిరిగి అక్కడి నుంచే బయలుదేరే ప్రాంతాన్ని 'రైల్వే టెర్మినల్'గా పేర్కొంటారు. సాధారణంగా ప్రధాన నగరాల్లోని రైల్వేస్టేషన్‌పై రైళ్ల ఒత్తిడిని తగ్గించడానికి దూరంగా ఈ రైల్వే టెర్మినల్‌ను నిర్మిస్తారు. సికిం ద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు చర్లపల్లిలో ఇటీవల టెర్మినల్ నిర్మించారు. అక్కడి నుంచే ఎక్కువ రైళ్లు రాకపో కలు సాగిస్తున్నాయి. అదేవిధంగా ముంబైలో కూడా రైల్వే టెర్మినల్ నిర్మించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, విశాఖపట్నంలలో ఈ టెర్మినళ్ల నిర్మాణానికి కేంద్ర రైల్వేమంత్రి ఆమోదం తెలిపారు. విజయవాడ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించడానికి అమరా వతిలో, విశాఖ స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించడానికి జగన్నాథపురంలో టెర్మినల్ నిర్మిస్తారు.ఇక సౌకర్యాలు గమనిస్తే టెర్మినల్‌కు వచ్చే రైళ్లు అక్కడే ఆగిపోయి తిరిగి అక్కడి నుంచే గమ్యస్థానాలకు బయ లుదేరుతాయి. అంటే ఆయా రైళ్లు అన్నింటికీ సర్వీసింగ్, మెయింటెనెన్స్, రిపేర్లు చేయడానికి అక్కడ వసతులు ఉంటాయి. అలాగే కోచింగ్ యార్డు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతు లు ఏర్పాటుచేస్తారు. విశాఖపట్నం నుంచి బయలుదేరి, తిరిగి ఇక్కడ కు వచ్చే ప్రధాన రైళ్లను టెర్మినల్ స్టేషన్‌కు తరలిస్తారు.ఆ విధంగా ఒత్తిడి తగ్గిస్తారు. జగన్నాథపురంలో మెగా రైల్వే కోచింగ్ యార్డ్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం 500ఎకరాల భూమి, నిర్మాణానికి రూ.2,887 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ఇప్పుడు దానిని రైల్వే టెర్మినల్‌గా మారిస్తే ఎంత ఖర్చు అవుతుందననేది అంచనాలు తయారు చేయాల్సి ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి.

ఈవీఎంలైనా.. బ్యాలెట్‌లైనా..

ప్రజా తీర్పు కూటమికే అనుకూలం

- పంచాయతీ ఎన్నికల్లోనూ అదే ఐక్యత, స్ఫూర్తితో కూటమి విజయపరంపర కొనసాగాలి
- ట్రిపుల్ ఇంజిన్ పాలనతో గ్రామాల అభివృద్ధికి వేగం.. బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్య రథం): ఎన్నికలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) ద్వారా జరిగినా, బ్యాలెట్ పేపర్ల ద్వారా జరిగినా ప్రజల మద్దతు ఎన్డీఏ కూటమికే ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఓటర్లు తమ ఓటు ద్వారా మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు ప్రదర్శించిన సమన్వయం, ఐక్యత, స్ఫూర్తిని రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు.

కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయికి వేగంగా చేరుతాయని పల్లా అన్నారు. ట్రిపుల్ ఇంజిన్ పాలన ద్వారా అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వల్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోని అగ్రగామి రాష్ట్రాల సరసన నిలిపేందుకు కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు ప్రధాన ప్రాధాన్యతలుగా తీసుకుని పాలన సాగిస్తోందని, ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు కూటమి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుంటోందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యంలో తగిన వాటా కల్పించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక సమీకరణలకు శ్రీకారం చుట్టిందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల స్థానిక సంస్థల్లో సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ ప్రాతి నిధ్యం కోల్పోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించేం దుకు ముందుకు వచ్చినప్పుడు వైసీపీ నేతలు న్యాయ స్థానాలను ఆశ్రయించి న్యాయపరమైన అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. అయినప్పటికీ టీడీపీ తన నిబద్ధతకు కట్టుబడి, పార్టీ టికెట్లలో 40 శాతం బీసీలకు కేటాయించడం ద్వారా వారికి రాజకీయ అవకాశాలను విస్తృతం చేసిందన్నారు. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా కాకుండా ఆచరణలో అమలుచేస్తున్నామని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,ప్రజల భాగ స్వామ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పల్లా వెల్లడించారు. మేయర్లు, చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిం దని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అత్యంత కీలకమని, ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలాచూడటమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు రిగ్గింగ్, దాడులు, బెదిరింపులతో కలుషిత మయ్యాయని ఆరోపించారు.ప్రస్తుతంఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య వాతావరణంలో ప్రశాం తంగా సాగుతోందన్నారు. రాష్ట్రంలో ఏదో జరుగు తోందన్న భావన కల్పించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు ప్రభావితం కావడం లేదని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారని చెప్పారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతం గా తమ ఓటు హక్కును వినియోగించుకోగలిగారని పేర్కొంటూ, ఇది రాష్ట్రంలో మారిన ఎన్నికల వాతా వరణానికి నిదర్శనమన్నారు. 2024అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ద్వారాజరిగిన పోలింగ్‌లో ఓటర్లు కూటమి పార్టీలకు మద్దతు తెలిపినట్లుగానే, ప్రస్తుతం బ్యాలెట్ పేపర్ల ద్వారా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నిక ల్లోనూ కూటమి మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

ప్రకృతి విపత్తుల సమయంలోనూ కూటమి ప్రభు త్వం సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించి, తక్షణ సహాయక చర్యలు చేపట్టిందని పల్లా శ్రీనివాస రావు గుర్తు చేశారు. ఇటీవల రెండు ప్రధాన విపత్తుల సందర్భాల్లో ప్రభుత్వ యంత్రాంగం తుపాను వేగంతో స్పందించి బాధితులకు ఉపశమనం, సహాయ సహకా రాలు అందించిందన్నారు. ఎల్‌నినో తీవ్ర ప్రభావం ఉన్నప్పటికీ సమర్థవంతమైన సాగునీటి నిర్వహణ, జలవనరుల వివేకవంతమైన వినియోగం ద్వారా పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

గ్రామాలే రాష్ట్ర ప్రగతికి పునాదులని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పల్లా శ్రీనివాస రావు పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఒకే విధమైన పరి పాలనా దృక్పథం,సమర్థవంతమైనసమన్వయం ఉంటే అభివృద్ధి పనులకు ఆటంకాలు తగ్గడంతోపాటు ప్రజ లకు మెరుగైన సేవలు అందుతాయని అభిప్రాయ పడ్డారు. ఈ నేపథ్యంలో రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూట మి మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులకు ప్రజలు భారీ మెజారిటీతో మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన,సంక్షేమ పథకాల సమర్థ అమలు, ప్రజాసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభు త్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో గ్రామాలు క్రియా శీల భాగస్వాములుగా ఉంటాయని, ఐక్యత, సమన్వ యంతో కూటమి ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ఏపీకి ఎయిర్ ట్రంక్...
లక్ష కోట్ల పైనే భారీ పెట్టుబడి

- **హైపర్ స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌లు**
- **ప్రభుత్వానికి డీపీఆర్ ఇచ్చిన సంస్థ**
- **దేశంలోనే బిగ్గెస్ట్ డిజిటల్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనున్న ఒప్పందం**

అమరావతి(చైతన్యరథం): డిజిటల్ ఇన్‌ఫ్రా రంగంలో ఆంధ్రప్రదేశ్ స్పీడ్ మామూలుగా లేదు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌స్టోన్ సపోర్ట్ ఉన్న ఎయిర్‌ట్రంక్ సంస్థ ఇప్పుడు ఏపీ వైపు చూస్తోంది. రాష్ట్రంలో ఏకంగా రూ. 1.03 లక్షల కోట్ల (11 బిలియన్ డాలర్లు) భారీ ఇన్వెస్ట్‌మెంట్‌తో రెండు హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌లు పెట్టేందుకు డీపీఆర్ కూడా రెడీ చేసి ప్రభు త్వానికి ఇచ్చింది. దేశంలోనే బిగ్గెస్ట్ డిజిటల్ ప్రాజెక్టులలో ఒకటిగా



నిలవనున్న ఈ డీల్‌పై ఏపీ సర్కార్ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఎయిర్‌ట్రంక్ ప్లాన్ ప్రకారం ఏపీలో మొత్తం 1.8 గిగావాట్ల కెపాసిటీతో రెండు భారీ డేటా సెంటర్ క్యాంపస్‌లు రాబోతున్నా యి. ఇంత పెద్దఎత్తున డేటా సెంటర్లు వస్తే రాష్ట్ర టెక్ ఎకోసిస్టమ్ నెక్ట్స్ లెవెల్‌కు వెళ్లడం ఖాయమని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ఇటు సాఫ్ట్‌వేర్ రంగానికి బూస్ట్ ఇవ్వడంతో పాటు వేల సంఖ్యలో యువతకు ప్రత్య క్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు రానున్నాయి.

కరెంట్, నీళ్ల టెన్షన్ లేదు..అంతా స్మార్ట్ ప్లానింగ్

ఇంత భారీ డేటా సెంటర్లు నడవాలంటే కరెంట్, నీళ్లు ఎలా సరిపోతాయన్న అనుమానాలు చాలామందికి రావచ్చు. దీనిపై సీఎం చంద్రబాబు పూర్తి స్పష్టత కూడా ఇచ్చారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కెపాసిటీని భారీగా పెంచుతున్నామని, వాటర్ సప్లై సిస్టమ్ ను కూడా స్ట్రాంగ్ చేస్తున్నామని చెప్పారు. మరోవైపు ఎయిర్‌ట్రంక్ కూడా పక్కా ప్లాన్‌తో వస్తోంది. ప్రజలు వాడుకునే మున్సిపల్ నీళ్ల జోలికి వెళ్లకుండా తక్కువ నీటితో నడిచే ఎయిర్-కూల్డ్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ వాటర్ మాత్రమే వాడతామని కంపెనీ స్పష్టం చేసింది. దాంతో ఆ అనుమానాలు కూడా తొలిగిపోయాయి.

ఏఐ అండ్ డేటా హబ్‌గా ఏపీ

ఇప్పటికే టెక్ దిగ్గజం గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏపీలో భారీ ఏఐ హబ్ కట్టే పనిలో ఉంది. ఇప్పుడు దానికి తోడుగా ఎయిర్‌ట్రంక్ రూ.1.03 లక్షల కోట్ల డీల్ తోడవ డంతో ఆంధ్రప్రదేశ్ ఇండియాలోనే బిగ్గెస్ట్ డేటా సెంటర్ అండ్ ఏఐ హబ్‌గా మారిపోతోందని పారిశ్రామిక నిపుణులు అంటు న్నారు. మొత్తం మీద ఈ మెగా ప్రాజెక్ట్ ఓకే అయితే ఏపీ టెక్ మ్యాప్ రూపురేఖలు మారిపోవడం గ్యారెంటీ.

వావి వరసలు తెలిసినోడు చేసే పనేనా?

- **తండ్రి వయసున్న వ్యక్తికి శుభలేఖ అందిస్తే చెట్టాపట్టాల్ అంటూ రోత రాతలా?**
- **మనిషై పుడితే ఆడబిడ్డపై ఇలాంటి నిందలా?**
- **తల్లి, చెల్లి తేడా లేకుండా దిగజారుడుతనం జంతువు చేష్టలకు పరాకాష్ట.. అత్యంత నీచం**
- **మీరే దగ్గరుండి రాయించారా? జవాబు చెప్పాలి**
- **సంజాయిషీ మీరిస్తారా? మీ సాక్షితో ఇప్పిస్తారా?**
- **జగన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆగ్రహం**

అమరావతి(చైతన్యరథం): తండ్రి వయసున్న వ్యక్తికి శుభలేఖ అందిస్తే చెట్టాపట్టాల్ అంటారా? ఆత్మీయ సంబంధాలని అంటగ డతారా? ఇది వావి వరసలు తెలిసినోడు చేసే పనేనా? సమాజం పట్ల విలువలు ఉన్నోడు రాసే రాతలేనా? మనిషై పుడితే ఆడబిడ్డ మీద వేసేవి ఇలాంటి నిందలా? అని సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జగన్‌రెడ్డిపై వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు, నా కుటుంబానికి జరిగిన వ్యక్తిత్వ హననం ఇది. వైసీపీ అండ్ కో నీచపు బుద్ధికి, మరింత దిగజారుడు సంస్కారానికి, తల్లి-చెల్లి అనే తేడా లేకుండా జంతు వు చేష్టలకు పరాకాష్ట అని మండిపడ్డారు. అద్దంలో వారి మొహం ఇంకా వారికి కనపడటం లేదు..మహిళల మీద వక్రభాష్యం చెప్ప డం మానలేదు.. సంబంధాలు అంటగట్టే నీచ సంస్కృతిని మరవలేదు..వారి మానసిక స్థితి మెరుగుపడలేదని ధ్వజమెత్తారు.

పెళ్లి పిలుపులో కూడా రాజకీయ కోణమా?

ఆత్మీయతతో పిలిచే పెళ్లి పిలుపులో కూడా రాజకీయ కోణం వెతుకుతారా? ఎవరి మెప్పుకోసం ఈ దిగజారుడు? నా కుమార్తె వివాహ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తే రాజకీయ కోణమని చెట్టపట్టాల్ అని, ఆత్మీయ సంబంధాలని తప్పుడు అర్థాలు వెతుకుతున్నారంటే మీ ఆలోచనా విధానం ఎంత కలుషి తమైందో, మీ స్థాయి ఎక్కడికి దిగజారిందో, మానవసంబంధాలు మరిచిపోయి రాక్షస తత్వాన్ని ఎందుకు ప్రదర్శిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు మళ్లీ మళ్లీ అర్థమవుతూనే ఉంది. ఆనాడు తన బిడ్డల పెళ్లిళ్లకు సైతం చంద్రబాబు గారిని వైఎస్ ఆహ్వానించారు. అంటే ఆయన కూడా చంద్రబాబుతో చెట్టపట్టాల్ వేసుకుని తిరిగినట్లా? బాబు గారు పెళ్లిళ్లకు వచ్చి ఆశీర్వచనాలు ఇస్తే వైఎస్ఆర్‌తో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నట్లా? అని ప్రశ్నించారు. అక్క చెల్లెమ్మల మీద అమితమైన ప్రేమ అని చెప్పే మీరు.. మీ పత్రిక సాక్షిలో ఇలాంటి చెట్టాపట్టాల్ వార్తను ఎలా సమర్థించుకుంటారు? ఒక ఆడబిడ్డ మీద నీలాప నిందలు వేయడమా మీ పత్రిక విధానమా? తల్లి, చెల్లి అనే బేధం లేకుండా బురద రాతలు రాపించడమా మీ అజెండా? ఇది మీరే దగ్గరుండి రాయించిన రోత రాతలా? సమాధానం చెప్పాలని నిలదీశారు.

అమరావతిలో మీడియా సిటీ!

- **తీర్చిదిద్దే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక అడుగు**
- **దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి రప్పించేలా**
- **పాలసీ నిబంధనలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు**
- **కనీసం లక్ష మంది యువతకు ఉద్యోగాలే లక్ష్యం**



అమరావతి(చైతన్యరథం): అమరావతిని అత్యాధునిక టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఏపీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ అండ్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ పాలసీ (2026-2031) ద్వారా రూ.5 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి కనీసం లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా అమరావతిలో ప్రత్యేక పార్కు, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన భారీ మీడియా సిటీని అభివృద్ధి చేయనుంది. ఈ రంగంలో దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి రప్పించేలా ప్రభుత్వం పాలసీ నిబంధనలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 5 ప్రధాన యాంకర్ యూనిట్లతో పాటు 100 కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా కేవలం రాజధాని ప్రాంతమే కాకుండా, రాష్ట్రంలోని టైర్-2, టైర్-3 నగరాలకు కూడా ఈ అభివృద్ధి ఫలాలను విస్తరిం చాలని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే ఐదేళ్ల పాటు అమల్లో ఉండే ఈ పాలసీ ద్వారా సృజనాత్మక రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవనుంది. పెట్టుబడిదారులను ప్రోత్స హించేందుకు ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన రాయితీలను ప్రకటించింది. ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పార్కు అభివృద్ధికి అయ్యే మూల ధన వ్యయంలో 25 శాతం (గరిష్ఠంగా రూ.50 కోట్లు), సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు 25 శాతం (గరిష్ఠంగా రూ.25 కోట్లు), మౌలిక సదుపాయాల కల్పన ఖర్చులో 50 శాతం (గరిష్ఠంగా రూ.2 కోట్లు) రాయితీగా అందించనుంది. రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టి, కనీసం 200 మందికి ఉపాధి కల్పించే ప్రాజెక్టు లను మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. మూలధన రాయితీలతో పాటు కంపెనీల నిర్వహణ ఖర్చుల్లోనూ ప్రభుత్వం అండగా నిలవనుంది. కార్యాలయ అద్దె, విద్యుత్ టారిఫ్, డిజిటల్ కనెక్టివిటీ, క్వాలిటీ సర్టిఫికేషన్ కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు చెల్లించడంతో పాటు ఐదేళ్ల పాటు SGST పూర్తిగా తిరిగి చెల్లించనుంది. స్టాంపు డ్యూటీ మినహాయింపు వంటి వెసులుబాట్లు కల్పించడంతో అమరావతి మీడియా సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపనున్నాయి.

పెద్దలను పెళ్లికి పిలవడం సంస్కారం

- **మహిళ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రాతలా?**
- **సాక్షి కథనాన్ని ఖండించిన మంత్రి లోకేష్**

అమరావతి(చైతన్యరథం): షర్మిల తన కుమార్తె వివాహానికి సీఎం చంద్రబాబుని ఆహ్వానించడంపై సాక్షి పత్రికలో వచ్చిన కథ నంపై మంత్రి నారా లోకేష్ తీవ్రంగా స్పందించారు. ఈ కథనం ఒక మహిళను కించపరిచేలా ఉందని, ఇది ఏ మాత్రం ఆమోద యోగ్యం కాదని ఎక్స్ వేదికగా ఖండించారు. కుమార్తె వివాహానికి ఇంటి పెద్దలను ఆహ్వానించడం మన సంస్కృతికి నిదర్శనం. అలాంటి ఆహ్వానాన్ని కూడా రాజకీయ కోణంలో చూస్తూ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా రాయడం సరికాదు. ప్రజా జీవితంలో రాజకీయ విభేదాలు ఉన్నా విలువలను ఎప్పటికీ కోల్పోకూడదు. మహిళలపై వ్యక్తిగత విమర్శలకు ఆంధ్రప్రదేశ్‌లో చోటు లేదు..సాక్షి పత్రిక బాధ్యతారహిత కథనాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కుమార్తె వివాహ శుభ సందర్భంగా షర్మిల, ఆమె కుటుంబానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ షర్మిల పోస్ట్‌ను కూడా జతచేశారు.



కూటమి విజయానికి సమష్టి కృషి

- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- శ్రేణులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపు



నెల్లూరు (చైతన్య రథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాయకులు, ప్రజాప్రతినిధులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేస్తూ,ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఏఎస్ పేట, సంగం, చేజర్ల మండలాలకు చెందిన నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ఏఎంసీ, పీఏసీఎస్, వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు.ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల అమలుకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే గ్రామస్థాయిలో నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. సాధ్యమైన చోట సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యేలా ప్రయత్నించాలని,కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు.పార్టీ నాయకుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం కీలక మని, వ్యక్తిగత అభిప్రాయ భేదాలకు తావివ్వకుండా పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఆనం రామనారాయణరెడ్డి సూచించారు.గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు తెలిపారు. సమావేశంలో ఏఎస్ పేట, సంగం, చేజర్ల మండలాలకుచెందిన నూతన ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఏఎంసీ, పీఏసీఎస్, వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'అక్వాన్'పై ప్రభుత్వం అలెర్ట్

- తీరప్రాంత జిల్లాలకు హై అలర్ట్..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- హోంమంత్రి అనిత వెల్లడి



అమరావతి (చైతన్య రథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. రానున్న నాలుగు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ అధికారులతో హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం అక్వాన్ తుపాను మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా, ఎల్లుండి ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు నుంచి తుని మధ్య తీరం దాటే సూచనలున్నాయి. తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, గతంలో అన్ని శాఖల సమష్టి కృషితో రెండు తుపాన్లను సమర్థంగా ఎదుర్కొన్నామని, అదే స్ఫూర్తితో ప్రస్తుత విపత్తును కూడా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని అన్నారు. విపత్తు సమయంలో ప్రజలకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హోం మంత్రి స్పష్టంచేశారు. తీరప్రాంత ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వర్షాలు, ఈదురుగాలుల నుంచి కాపాడు కునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందస్తు సూచనలు అందించా లని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్, విపత్తుల నిర్వహణ, వ్యవసాయ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అనిత స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సంసిద్ధతతో ఉండాలని ఆదేశించారు.



బనగానపల్లె చరిత్ర, వైభవం ప్రతిబింబించేలా ముఖద్వారాల ఆధునికీకరణ

- సందర్శకులను ఆకట్టుకునేలా సరికొత్త రూపు..
- పనులపురోగతిని పరిశీలించిన మంత్రి జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె (చైతన్య రథం): బనగాన పల్లె పట్టణచారిత్రక నేపథ్యం, సంస్కృతి, ప్రత్యేకత,వైభవం ఉట్టిపడేలా పట్టణ ముఖద్వారాలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి వచ్చే సందర్శకులను ఆకట్టుకునేలా సుందరమైన డిజైన్లతో ముఖద్వారాల ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. బనగానపల్లె పట్టణంలో జరుగుతున్న ముఖద్వారాల ఆధునికీకరణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరికీ బనగానపల్లె చారిత్రక విశిష్టత, వారసత్వ సంపద గుర్తుకొచ్చేలా ముఖద్వారాల నిర్మాణ శైలి ఉండాలని సూచించారు. కేవలం ప్రవేశద్వారాల నిర్మాణానికే పరిమితం కాకుండా, పట్టణానికి ప్రత్యేక గుర్తింపు నిచ్చేలా వాటిని అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక నిర్మాణ శైలితోపాటు పట్టణ చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ముఖద్వారాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ పయనం

- పారిశ్రామికవేత్తల్లో భయం పోయింది..
- చంద్రబాబుపై నమ్మకం పెరిగింది
- శాప్ చైర్మన్ రవినాయుడు వ్యాఖ్య

తిరుపతి (చైతన్య రథం): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై పారిశ్రామిక వర్గాల్లో నమ్మకం పెరిగిందని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం రాష్ట్రంలో మారుతున్న పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమని పేర్కొన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు ఆంధ్రప్రదేశ్ వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయారని, పెట్టుబడులు పెట్టేందుకు కూడా ఆసక్తి చూపలేదని రవినాయుడు విమర్శించారు.అప్పట్లో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా పారిశ్రామికవేత్తల్లో భయాందోళనలు ఏర్పడ్డాయని, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం ఏపీలో పెట్టుబడులు పెట్టబోమని కొందరు పారిశ్రామిక వేత్తలు స్పష్టంచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ విధానాలతో ఆ పరిస్థితి మారిందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెరగడం వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాల్సింది పోయి ప్రభుత్వంపై విమర్శలు, విషప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు.



మరోవైపు విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని రవినాయుడు తెలిపారు. విద్యావ్యవస్థను పద్ధతి ప్రకారం ప్రక్షాళన చేస్తూ, సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అయితే ఈ మార్పులను జీర్ణించుకోలేక లోకేష్‌పై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను గత వైసీపీ ప్రభుత్వమే పేరుకుపోయేలా చేసిందని, ఆ బకాయిలను ప్రస్తుత ప్రభుత్వంపై నెట్టడం సరికాదని పేర్కొన్నారు. గత పాలనలో చేసిన తప్పులకు కూటమి ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చూపించే ప్రయత్నం చేయడం తగదన్నారు. పారిశ్రామికాభివృద్ధి, విద్యారంగ సంస్కరణలు, యువతకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని శాప్ చైర్మన్ రవినాయుడు స్పష్టం చేశారు.

అక్వాన్ తుపానుపై అత్యంత అప్రమత్తంగా ఉండాలి

- ప్రజల ప్రాణరక్షణకు ప్రాధాన్యత..
- గ్రామాల్లో ఆహారం, తాగునీరు అందుబాటులో ఉంచాలి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



అమరావతి (చైతన్య రథం): అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల సిబ్బంది పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. గత రెండు తుపానులతో పోలిస్తే అక్వాన్ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత, లోతట్టు గ్రామాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్వాన్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో తన పరిధిలోని శాఖల అధికారులతో పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20న నెల్లూరు–తుని మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 120 నుంచి 145కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలున్నాయని అధికారులు వివరించారు. ఈనెల 19, 20తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. నెల రోజుల వ్యవధిలో అర్నబ్, మురసు తుపాన్లు రాష్ట్ర తీర ప్రాంతాన్ని ప్రభావితం చేశాయని, ప్రభుత్వ ముందస్తు చర్యలతో ప్రాణనష్టం నివారించగలిగినా పంటలు, ఆస్తులకు నష్టం వాటిల్లిందన్నారు.ఆతుపాన్ల కారణంగా సుమారు 520 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే అక్వాన్‌ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంత, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైన చోట్ల వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు అందుబాటులో ఉంచాలని, భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతింటే తక్షణ మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. రహదారులపై చెట్లు కూలితే వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తుపాను గమనంపై స్పష్టత లేని నేపథ్యంలో తీరం తాకే అవకాశమున్న అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వం, వాతావరణ శాఖ నుంచి వచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని, గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన వెంటనే నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయడంతో పాటు పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

రైతులకు ముందస్తు సూచనలు ఇవ్వాలి

వరి పంట కోతకు సిద్ధమవుతున్న సమయంలో తుపాను ముప్పు ఏర్పడటం ఆందోళనకరమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పంట నష్టం తగ్గించేందుకు రైతులను అప్రమత్తం చేయాలని, కోతకు వచ్చిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహకారం అందించాలని పంచాయతీరాజ్ సిబ్బందికి సూచించారు. భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉన్నందున,వాటిని త్వరగా పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. దెబ్బతిన్న రహదారుల వివరాలను వెంటనే సేకరించి మరమ్మతులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రజలు బీచ్‌ల వైపు వెళ్లకుండా, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల తుపాను గాలుల్లో చిక్కుకున్న తమిళనాడు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఈసందర్భంగా ప్రస్తావించారు. ప్రజలు ప్రభుత్వ హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ అధికారులకు సహకరించాలని, తుపాను ప్రభావంపూర్తిగా తగ్గేవరకు క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లోనే అందుబాటులో ఉండాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

మరమ్మతుల సమయంలో బ్లో అవుట్: ఓఎన్‌జీసీ



మామిడికుదురు (చైతన్య రథం): కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ సమీపంలో గ్యాస్ బ్లోఅవుట్ ఘటనపై ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) ప్రకటన విడుదల చేసింది. గ్యాస్ బావి వద్ద ఇవాళ ఉదయం సుమారు 5గంటల సమయంలో గ్యాస్ లీకైనట్లు సమాచారం అందిన వెంటనే.. అవసరమైన చర్యలను చేపట్టినట్లు తెలిపింది. మరమ్మతు పనులు జరుగుతుండగా గ్యాస్ బ్లో అవుట్ జరిగినట్లు తెలిపింది. సమాచారం అందిన వెంటనే ఓఎన్‌జీసీ సిబ్బంది రాజమండ్రి విపత్తునిర్వహణ బృందాన్ని అప్రమత్తం చేశారు. వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని తగిన భద్రత, వెల్ కంట్రోల్ చర్యలను ప్రారంభించారు. ముందు జాగ్రత్త చర్యగా బావి చుట్టూ 500మీటర్ల పరిధిలోని ప్రాంతాన్ని దిగ్బంధించి, సమీపంలోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జాతీయ రహదారి 216పై ప్రభావితమైన మార్గంలో వాహనాల రాకపోకలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు.ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. ముందుజాగ్రత్త చర్యగా వాటర్‌బ్లాంకెట్ (నీటి పొర)ను కూడా ఏర్పాటుచేశారు.సహాయక చర్యల కోసం జిల్లా యంత్రాంగం, సంబంధిత రాష్ట్ర అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నాం" అని ఓఎన్‌జీసీ పేర్కొంది.

మామిడికుదురులో అదుపులోకి వచ్చిన బ్లో అవుట్

గ్యాస్ బ్లో అవుట్ అదుపులోకి వచ్చింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బురద పంప్ చేసి షియర్ ర్యామ్ ఏర్పాటు చేసిన అధికారులు క్రమంగా లీకేజీని అదుపులోకి తెచ్చారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై అచ్చెన్న ఆరా

ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు మంత్రి ఆదేశం

అమరావతి (చైతన్య రథం): కోనసీమ జిల్లాలోని రాజోలు సమీపంలో గెద్దాడవారి కుంత వద్ద చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ లీకేజీ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి, పరిసర గ్రామాల ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్యాస్ లీకేజీ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని, పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.



గ్యాస్ లీకేజీ ఘటనపై ఎంపీ సానా సతీష్ బాబు ఆరా

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి..

అధికారులకు సూచన

రాజోలు (చైతన్య రథం): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గం సమీపంలోని గెద్దాడవారి కుంత వద్ద చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనపై రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన తాజా పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్యాస్ లీకేజీ నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్యాస్ లీకేజీని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఓఎన్జీసీ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎంపీ స్పష్టం చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, గ్యాస్ లీకేజీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు సూచించారు.

బ్లో అవుట్ ఘటనపై పవన్ కళ్యాణ్ ఆరా

- ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం
- వరుస ఘటనల నేపథ్యంలో ఓఎన్జీసీ భద్రతా ప్రమాణాలపై సేఫ్టీ ఆడిట్‌కు ఆదేశం




అమరావతి (చైతన్య రథం): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం నగరం గ్రామ పరిధిలోని తాడివారిమెరక సమీపంలో ఓఎన్జీసీ గ్యాస్ డ్రిల్లింగ్ బావి వద్ద చోటుచేసుకున్న బ్లో అవుట్ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. ఘటన తీవ్రత, పరిసర గ్రామాల ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో పెద్ద శబ్దంతో ఒక్కసారిగా గ్యాస్ వెలువడినట్లు జిల్లా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. గ్యాస్ లీకేజీ ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలందరినీ నగరంలోని పునరావాస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సమీప జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు వెల్లడించారు.

ఇప్పటికే ఓఎన్జీసీ సాంకేతిక బృందం ఘటనాస్థలికి చేరుకుని గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టిందని, మరో ఐదు గంటల్లో పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇటీవల తరచూ గ్యాస్ లీకేజీ, బ్లో అవుట్ ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓఎన్జీసీ చైర్మన్, ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే భద్రతా ప్రమాణాలపై సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలను సమీక్షించాలని సూచించారు. గ్యాస్ లీకేజీ ప్రభావిత ప్రాంతాల ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సహాయక చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు.

‘అక్వాన్’పై అంతటా అప్రమత్తం

- 20న నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 130 కి.మీ వేగంతో గాలులు..
- కోస్తా జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన..
- 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సన్నద్ధం



అమరావతి (చైతన్య రథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను క్రమంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరంవైపు దూసుకొస్తోంది. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు–విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 120–130 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. తుపాను ముప్పు నేపథ్యంలో కోస్తా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సీఈవో ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

దక్షిణ, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అక్వాన్ తుపాను గడిచిన మూడు గంటలుగా స్థిరంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న ఈ తుపాను బుధవారం ఉదయానికి తీవ్ర తుపానుగా, గురువారం సాయంత్రానికి మరింత బలపడి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం చెన్నైకి 590 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 650 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 650 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 780 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించారు.

భారీ వర్షాలు.. బలమైన గాలులు

తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ హెచ్చరించింది. బుధవారం సాయంత్రం నుంచే కోస్తా తీరం వెంబడి గంటకు 100–110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం నుంచి తుపాను తీరం దాటే వరకు గంటకు 120–130 కిలోమీటర్లు, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచవచ్చని తెలిపింది. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టం చేసింది.

సహాయక బృందాలు సిద్ధం

తుపాను కదలికలను ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ప్రఖర్ జైన్ తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. అత్యవసర సహాయక చర్యల కోసం 13 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు

తుపాను నేపథ్యంలో ప్రజలు పుకార్లను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని, అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని ఏపీఎస్డీఎంఏ సూచించింది. మొబైల్ ఫోన్లను పూర్తిస్థాయిలో ఛార్జ్ చేసుకోవడంతోపాటు, విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్, భారత వాతావరణ శాఖ జారీ చేసే వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపింది. విలువైన పత్రాలు, ధ్రువీకరణ పత్రాలను వాటర్‌ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవాలని, కనీసం వారం రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, తాగునీటితో అత్యవసర కిట్ సిద్ధం చేసుకోవాలని సూచించింది. ఇంటి పైకప్పు, తలుపులు, కిటికీలు పటిష్ఠంగా ఉన్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని పేర్కొంది.

తుపాను సమయంలో అప్రమత్తత అవసరం

తుపాను సమయంలో ఇంట్లోని విద్యుత్ మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేసి, గ్యాస్ కనెక్షన్లను సురక్షితంగా తొలగించి, తలుపులు, కిటికీలను గట్టిగా మూసి ఉంచాలని సూచించింది. ఇల్లు సురక్షితం కాదని భావిస్తే ముందుగానే పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని తెలిపింది. తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాతే వినియోగించాలని పేర్కొంది. భవనం ఆకస్మికంగా దెబ్బతినే సూచనలు కనిపిస్తే బలమైన టేబుల్ లేదా బెంచ్ కింద తలదాచుకోవాలని సూచించింది. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులు ఆదేశించిన వెంటనే ఎత్తైన, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరింది. తుపాను సమయంలో బయట ఉండాల్సి వస్తే పాత, దెబ్బతిన్న భవనాల్లోకి వెళ్లకూడదని, చెట్లు, హోర్డింగులు, విద్యుత్ స్తంభాల కింద నిలబడరాదని హెచ్చరించింది. మత్స్యకారులు తమ పడవలు, తెప్పలను సురక్షిత ప్రాంతాల్లో బలమైన తాళ్లతో గట్టిగా కట్టి ఉంచాలని సూచించింది.

తుపాను అనంతరం కూడా జాగ్రత్తలు తప్పనిసరి

తుపాను ప్రభావం తగ్గిన తర్వాత కూడా అధికారిక ప్రకటన వెలువడే వరకు పునరావాస కేంద్రాలను విడిచి ఇళ్లకు వెళ్లరాదని ఏపీఎస్డీఎంఏ స్పష్టం చేసింది. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నీటిలో తడిసిన లేదా దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలక్ట్రీషియన్ తనిఖీ చేసిన తర్వాతే వినియోగించాలని తెలిపింది.

అత్యవసర సహాయం కోసం సంప్రదించండి


తుపాను కారణంగా ఏదైనా సమస్య ఎదురైతే 9552300009 నంబర్‌లోని ‘మన మిత్ర’ సేవ ద్వారా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రఖర్ జైన్ సూచించారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం 112, 1070, 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని కోరారు. తుపాను ముప్పు పూర్తిగా తొలగే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అక్వాన్ తుపాను వేళ విద్యుత్ ప్రమాదాలపట్ల అప్రమత్తం

- ప్రజలకు ఏపీసీపీడీసీఎల్ సూచనలు..

- అత్యవసర సహాయం కోసం 1912కు కాల్ చేయండి

విజయవాడ (చైతన్య రథం): అక్వాన్ తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు.భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి, సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారెడ్డి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ సూచించింది. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు, స్తంభాల సమీపానికి వెళ్లకూడదని హెచ్చరించింది. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, ఇతర విద్యుత్ ప్రమాదాలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, అత్యవసర సహాయం అవసరమైనా ఏపీసీపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ లిలి1912లిలిను సంప్రదించాలని సూచించింది.

జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు:

కృష్ణా	: 6281709355
ఎన్టీఆర్	: 9440817561
గుంటూరు	: 9440817526
బాపట్ల	: 9281413774
ప్రకాశం	: 9440817491
పల్నాడు	: 7382623148
మార్కాపురం	: 7780420711
సీఆర్‌డీఏ	: 8331092947

తుపాను సమయంలో ప్రజలు విద్యుత్ భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని, అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు సహకరించాలని ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది.

స్థానిక సంస్థల ఎన్నికలకు

పటిష్ట భద్రతా చర్యలు

- ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సన్నద్ధం: ఐజీ



విజయవాడ (చైతన్య రథం): రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మార్గదర్శకత్వంలో రెండో విడత సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఐజీ బి. రాజకుమారి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 14 నుంచి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన శాంతిభద్రతల చర్యల్లో భాగంగా 24 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 444 కేసులు నమోదు చేయగా, 200.55 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద 722 బైండ్‌ఓవర్ కేసులు నమోదు చేసి, 5,327 మందిని బైండ్‌ఓవర్ చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని ఐజీ రాజకుమారి స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ అరాచకాలు

- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన తెలుగుదేశం
- 500-600 మందితో జైలు వద్దకు వెళ్లిన పెద్దిరెడ్డి, సజ్జలపై చర్యలు తీసుకోవాలి
- ఆర్వోపై చేయి చేసుకున్న మాజీ ఎమ్మెల్యే రామ్ ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి
- వేంపల్లి దాడి ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్
- వైసీపీ నామినేషన్లను ఎక్కడ అడ్డుకున్నారో చెప్పాలని జగన్‌కు వర్ల రామయ్య సవాల్



విజయవాడ (చైతన్య రథం): పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అసాంఘిక శక్తులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ దాడులు, అల్లర్లకు పాల్పడుతున్నాయని తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు టీడీపీ నేతల బృందం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డాక్టర్ ఏ మల్లికార్జున, ఐజీ రాజకుమారిలను కలిసి సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదుతో పాటు సాక్ష్యాధారాలను అందజేసింది. ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్‌లతో కూడిన బృందం ఎన్నికల కమిషన్ అధికారులను కలిసి ఫిర్యాదు చేసింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ శ్రేణులు కడప, గుంటూరు జిల్లాల్లో ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతూ దాడులకు పాల్పడుతున్నాయని టీడీపీ బృందం పేర్కొంది.

గుంటూరు జైలులో ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించేందుకు వైసీపీ నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలు సుమారు 500 నుంచి 600 మంది అనుచరులను వెంటబెట్టుకుని వెళ్లడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో తెలిపారు. నామినేషన్ చెల్లదని తిరస్కరించినందుకు ఆగ్రహంతో మాజీ ఎమ్మెల్యే రామ్ ప్రతాప్‌రెడ్డి, పిచ్చిరెడ్డి అనే వ్యక్తి అందరూ చూస్తుండగానే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) చెంపపై కొట్టారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన సాక్ష్యాధారాలను ఎస్ఈసీకి అందజేశారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం మీడియాతో ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల పోరు ప్రారంభమైనప్పటి నుంచి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ అరాచకాలు, అసాంఘిక శక్తుల ఆటలు మితిమీరిపోతున్నాయని, వీటికి తోడు పోలీసు వ్యవస్థ నిర్లిప్తత ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఆరోపించారు.

నిన్న కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి మండలంలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరై బొలెరో వాహనంలో ఇంటికి తిరిగి వెళ్తున్న టీడీపీ మండల స్థాయి ముఖ్య నాయకుడిపై వైసీపీ శ్రేణులు హత్యాయత్నానికి పాల్పడ్డాయని తెలిపారు. హెల్మెట్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెంబడించి వాహనాన్ని అడ్డుకోగా, అప్పటికే అక్కడ మాటువేసిన 10-15 మంది కర్రలు, కత్తులు, ఐరన్ రాడ్లతో దాడి చేశారని పేర్కొన్నారు. తమ నాయకుడు అప్రమత్తమై పారిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారని, దుండగులు బొలెరో వాహనానికి నిప్పు పెట్టి పూర్తిగా తగలబెట్టారని చెప్పారు. పులివెందులలో ఓడిపోయామన్న దుగ్ధ, అసూయతోనే జగన్ ఈ దాడులు చేయిస్తున్నారా అని ప్రశ్నించారు.

గుంటూరు జైలులో ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించేందుకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలు 500-600 మందిని వెంటబెట్టుకుని వెళ్లడం దారుణమని వర్ల రామయ్య అన్నారు. ముగ్గురికే అనుమతి ఉందని పోలీసులు అడ్డుకున్నా లెక్కచేయకుండా గేటు తోసుకుని లోపలికి వెళ్లారని ఆరోపించారు. ఈ తోపులాటలో ఒక ఎస్సై కాలు విరిగిందని తెలిపారు. అడుగడుగునా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని జగన్ తన పార్టీ నేతలకు ఆదేశాలిచ్చారా అని ప్రశ్నించారు. నామినేషన్ చెల్లదని తిరస్కరించినందుకు మాజీ ఎమ్మెల్యే రామ్ ప్రతాప్‌రెడ్డి, పిచ్చిరెడ్డి అనే వ్యక్తి అందరూ చూస్తుండగానే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) చెంపపై కొట్టారని ఆరోపించారు. అక్కడే ఉన్న పోలీస్ అధికారి కుర్చీలో నిద్రపోతూ నిర్లిప్తంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. చట్టబద్ధంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపైనే దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు.

అన్నమయ్య జిల్లాలో నామినేషన్ వేయడానికి వెళ్తున్న తమ పార్టీ అభ్యర్థుల వాహనాలను మాజీ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి సమక్షంలోనే కర్రలు, రాళ్లతో ధ్వంసం చేశారని వర్ల రామయ్య ఆరోపించారు. స్వయంగా ఆయనే ఉండి దాడి చేయమని ప్రోత్సహించారని అన్నారు. వైసీపీ నేతలే దాడులు చేసి, వాహనాలు తగలబెట్టి తిరిగి టీడీపీపై నిందలు వేస్తూ ఎన్నికల కమిషన్ వద్దకు వచ్చి నంగనాచి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. దమ్ముంటే ఎక్కడ, ఏ సమయానికి తమ నామినేషన్లను టీడీపీ నేతలు అడ్డుకున్నారో చెప్పాలని జగన్‌కు సవాల్ విసిరారు.

రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలన్నింటిపై సాక్ష్యాధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు, ఐజీ రాజ్‌కుమారికి వివరించామని తెలిపారు. వేంపల్లి దాడి కేసులో పట్టుబడిన వారితోపాటు మిగిలిన నిందితులందరినీ అరెస్ట్ చేసి, హత్యాయత్నం కింద జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని డిమాండ్ చేశారు. ఆర్వోపై చేయి చేసుకున్న రామ్ ప్రతాప్‌రెడ్డిని, జైలు వద్ద పోలీసు అధికారి గాయపడటానికి కారణమైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. ఇలాంటి దౌర్జన్యాలకు తెలుగుదేశం పార్టీ భయపడదని, రానున్న పంచాయతీ ఎన్నికలతో పాటు మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలోనూ టీడీపీ కూటమే ఘనవిజయం సాధిస్తుందని, వైసీపీకి శృంగభంగం తప్పదని ఎమ్మెల్సీ వర్ల రామయ్య హెచ్చరించారు.

సూక్ష్మ పరిశ్రమలతోనే
వికసిత్ భారత్ సాకారం

రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్



న్యూఢిల్లీ: భారతీయ యువ శక్తి సామాజిక ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని షాంగ్రి-లా ఈరోస్ వేదికగా జరిగిన 'జేఆర్‌డీ టాటా అవార్డ్స్ - 2026' ప్రత్యేక ప్లీనరీ సమావేశంలో రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పాల్గొన్నారు. 'సూక్ష్మ పరిశ్రమలు: వికసిత్ భారత్‌కు మార్గం' అనే అంశంపై జరిగిన కీలక చర్చాగోష్ఠిలో కేంద్ర రోడ్డు రవాణా,రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ,ప్రధానమంత్రి ఆర్థిక లహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.మహేంద్ర దేవ్,ఎన్డీటీవీ సీఈఓ,ఎడిటర్-ఇన్-చీఫ్ రాహుల్ కన్వల్‌తో కలిసి చింతకాయల విజయ్ వేదికను పంచుకుని,సూక్ష్మ పరిశ్రమల బలోపేతంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. చింతకాయల విజయ్ మాట్లాడుతూ.. "కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రొఫెసర్ మహేంద్ర దేవ్, రాహుల్ కన్వల్‌వంటి ప్రముఖులతో కలిసి ప్రత్యేక ప్లీనరీలో పాల్గొనడం, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధిపై జరిగిన అర్థవంతమైన చర్చలో భాగస్వామి కావడం తనకు దక్కిన అరుదైన గౌరవమని వ్యాఖ్యానించారు. భారతదేశపు గ్రామీణ పారిశ్రామికవేత్తలను (గ్రాంప్రెన్యూర్స్) ప్రోత్సహిస్తూ అత్యంత స్ఫూర్తిదాయకమైన ఈవేడుకను నిర్వహించిన బీవైఎస్టీ వ్యవస్థాపక,మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మీ వెంకటేశన్, వారి బృందం మొత్తానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మరింత శక్తివంతమైన, సమ్మిళిత భారతదేశాన్ని నిర్మిస్తున్న ఈ ఔత్సాహిక పారిశ్రామిక స్ఫూర్తికి మద్దతుగా నిలవడం ఎంతోగర్వంగా ఉంది" అని చింతకాయల విజయ్ వ్యాఖ్యానించారు.

సొంత చెల్లిని అవమానించే
జగన్ రాజకీయాలకు అనర్హుడు

మహిళా లోకానికి తక్షణమే క్షమాపణ చెప్పాలి: పీతల సుజాత

మంగళగిరి (చైతన్య రథం): రాజకీయ విమర్శలకు ఒక హద్దు ఉంటుందని, మీడియా స్వేచ్ఛకు సామాజిక బాధ్యత కూడా ఉండాలని ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. సొంత చెల్లి షర్మిల కుమార్తె వివాహ ఆహ్వానాన్ని కూడా రాజకీయ కోణంలో వక్రీకరిస్తూ సాక్షి పత్రికలో అసభ్యకరమైన కథనం ప్రచురించడం జగన్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి చర్యలతో మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచిన జగన్, మహిళా లోకానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, షర్మిల తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిస్తే, దానిపై 'బాబుతో చెట్టపట్టాల్' అంటూ సాక్షి పత్రికలో వక్రీకరించిన కథనం రాయించడం దారుణమన్నారు. శుభకార్యాలకు పెద్దలను ఆహ్వానించడం తెలుగు సంప్రదాయంలో గౌరవప్రదమైన ఆచారమని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు



రాజకీయ సమకాలికులుగా, ముఖ్య మంత్రులుగా పనిచేశారని గుర్తుచేశారు. అలాంటప్పుడు తన తండ్రి వయసున్న వ్యక్తిని కుమార్తె వివాహానికి ఆహ్వానించడంలో తప్పేముందని ప్రశ్నించారు.

ఒక మహిళా నేత వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ కక్షతో ముడిపెట్టి అసభ్యకరమైన రాతలు రాయించడం కేవలం షర్మిలను అవమానించడం మాత్రమే కాదని, యావత్ మహిళా లోక ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని సుజాత మండిపడ్డారు. మహిళలను గౌరవించే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించి కుట్ర రాజకీయాలకు ప్రాధాన్యమివ్వడం బాధాకరమన్నారు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' అనే భారతీయ సంస్కృతిలోని గొప్ప విలువలను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జర్నలిజం పేరుతో విషపూరిత కథనాలు ప్రచురించడం సమాజ ఆరోగ్యానికి హానికరమని వ్యాఖ్యానించారు. 'స్మోకింగ్ ఈజ్ ఇంజూరియస్ టు హెల్త్' అన్నట్లుగా, 'సాక్షి ఈజ్ ఇంజూరియస్ టు అవర్ హెల్త్'అని విమర్శించారు. రాజకీయ లబ్ధికోసం సొంత కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా వ్యవహరించడం, మీడియా సంస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం బాధ్యతాయుతమైన జర్నలిజానికి విరుద్ధమన్నారు.

గతంలోనూ కుటుంబ సంబంధాలు, ఆస్తివివాదాల విషయంలో జగన్ వ్యవహారశైలిపై అనేక విమర్శలు వచ్చాయని సుజాత పేర్కొన్నారు. తల్లి, చెల్లితో విభేదాలు, మేనకోడలి వివాహానికి సంబంధించి చోటుచేసుకున్న పరిణామాలు ప్రజల దృష్టిలో ఉన్నాయని అన్నారు. అయినప్పటికీ తన వైఖరిలో మార్పు రాకపోవడం విచారకరమన్నారు. సొంత చెల్లి షర్మిలపై సాక్షి పత్రికలో ఇలాంటి కథనాలు రాయించడం ద్వారా జగన్ తన రాజకీయ విలువలను తానే దిగజార్చుకున్నారని విమర్శించారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా కనీస మర్యాద, సంస్కారం, బాధ్యత ను పాటించాలని హితవు పలికారు. మహిళల మనో భావాలను దెబ్బతీసే ఇటువంటి కథనాలను తక్షణమే నిలిపివేయాలని, షర్మిలకు మాత్రమే కాకుండా యావత్ మహిళా లోకానికి జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పీతల సుజాత డిమాండ్ చేశారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలి!

●సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల విజయానికి పునాది

●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, పార్వతీపురం, నవంబర్ 17: పార్వతీపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్‌గా ఇటీవల ఎన్నికైన బెలగాం కరుణ ఈ నెల 23న ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో, విశ్వాసంతో కల్పించిన అవకాశాన్ని ప్రజాసేవకు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన వారు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, పార్వతీపురం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజల మన్ననలు పొందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి. జయబాబు, బి. సీతారాం, బి. రామకృష్ణ, ఎస్. కమల్ కుమార్, పటానా ప్రేమ్, భరతం సాయి, సిరిపురం బాషా, ఏ. నాగేంద్ర, ఎంబోలిసం సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనపై విశ్వాసం.. అచ్చెన్నాయుడు నాయకత్వంలో టీడీపీలోకి 20 కుటుంబాలు!

సంతబొమ్మాళి మండలం బావనపాడు గ్రామ పంచాయితీ నుంచి వైకాపా పార్టీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేస్తున్న పథకాలు, పాలనపై తమకు ఉన్న నమ్మకం, విశ్వాసమే టీడీపీలో చేరేందుకు ప్రధాన కారణమని నూతనంగా పార్టీలో చేరిన వారు వెల్లడించారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వారంతా వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి, ప్రజలకు చేరువవుతున్న సంక్షేమ పథకాలు తమను ఆకర్షించాయని, అందుకే టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు వారు పేర్కొన్నారు. పిఏసిఎస్ మాజీ అధ్యక్షు కింజరాపు హరి వరప్రసా తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో దుర్గమ్మను తాకిన భానుడి కిరణాలు



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా పాలకొండ పట్టణంలోని కొలువైన ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోటదుర్గమ్మను మంగళవారం సూర్యకిరణాలు స్పృశించాయి. గర్భాలయంలో ఉన్న మూలవిరాట్ను సూర్యకిరణాలు తాకడం ఏడాదిలో ఒక నవంబర్లో మాత్రమే జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తెలిపారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంజనీరింగ్ కనీస ఫీజు పెంపుపై అపెక్మా హర్షం

అమరావతి (చైతన్యరథం): ఇంజినీరింగ్ కనీస ఫీజును రూ.40 వేల నుంచి రూ.47 వేలకు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అపెక్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజెస్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్) సంతోషం వ్యక్తం చేసింది. తాత్కాలిక ఫీజు పెంపుపై ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కాగా.. కొత్త బ్లాక్ పీరియడ్ (2026-29)కు సంబంధించిన పూర్తిస్థాయి ఫీజుల వివరాలను ప్రభుత్వం.. రాబోయే రెండు నెలల్లో ఖరారు చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు సుమారు రూ.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం నెలకు రూ.200 నుంచి రూ.250 కోట్లను ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేస్తోంది. కాగా.. నెలకు రూ. 400 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని అపెక్మా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2025--26 విద్యా సంవత్సరానికి రూ.1,800 కోట్ల ప్రొసీడింగ్స్ జారీ కాగా, ఇప్పటివరకు రూ.1,000 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.800 కోట్లను రాబోయే 2-3 నెలల్లో క్లియర్ కానున్నాయని అపెక్మా వెల్లడించింది. కాగా.. 2026--27 విద్యా సంవత్సరం ఫీజుల్లో కనీసం 50 శాతం నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే చెల్లించాలని ప్రభుత్వానికి అపెక్మా విన్నవించుకుంది. విద్యార్థులకు నేరుగా అందాల్సిన ఎంటీఎఫ్ నిధులను కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది.

ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్ న్యూస్... కొత్తగా 30 ఈవీ ఎలక్ట్రిక్ మెట్రో బస్సులు... మహిళలకు ఫ్రీ !



గాజువాక (చైతన్యరథం): విశాఖపట్నంలోని గాజువాక డిపోలో 30 కొత్త ఎలక్ట్రిక్ మెట్రో బస్సులను ప్రారంభించగా, వీటిలో మహిళలకు 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నంలో సరికొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలి విడతలో భాగంగా మొత్తం 30 ఎలక్ట్రిక్ మెట్రో బస్సులను విశాఖలోని గాజువాక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ జేఎండీ శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సరికొత్త ఈవీ బస్సుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనుండటంతో నగరవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే: పల్లా శ్రీనివాసరావు

ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పీఎం ఈ-సేవ పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులను విశాఖలో ప్రారంభించడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. రాబోయే భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాల మీదే ఆధారపడి ఉందని, ఈ ఆధునిక ఈవీ బస్సుల్లో స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

శబ్ద కాలుష్యం లేని సురక్షిత ప్రయాణం.. పర్యాటకులకు ఎంతో మేలు:

విశాఖ సిటీ పరిధిలో ప్రయాణించే వారికి ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా, పూర్తి భద్రతతో కూడిన ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని అందించేందుకే ఈ 30 ఈవీ మెట్రో సర్వీసులను ప్రవేశపెట్టామని ఆర్టీసీ జేఎండీ శివప్రసాద్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అధునాతన ఫీచర్లతో కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ బస్సుల రాకతో విశాఖ స్థానికులతో పాటు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు దేశవ్యాప్తంగా వచ్చే పర్యాటకులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

దూసుకొస్తున్న అక్వాన్ తుపాను... భీకర గాలులు... భారీ వర్షాలు



అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను క్రమంగా బలపడుతోంది. ప్రస్తుతం గంటకు 3 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఇవాళ తీవ్ర తుపానుగా, గురువారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు - విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అక్వాన్ తుపాను ప్రస్తుతం చెన్నైకి 600 కిలోమీటర్ల దూరంలో.. మచిలీపట్నానికి 650 కిలోమీటర్ల దూరంలో.. విశాఖపట్నానికి 660 కిలోమీటర్ల దూరంలో.. ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 780 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు సగటున 3 కిలోమీటర్ల వేగంతో తుపాను కదిలినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తున్న ఈ తుపాను మరింత బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నేడు తీవ్ర తుపానుగా మారే అవకాశం

అక్వాన్ తుపాను ఇవాళ తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. రేపటి ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడవచ్చని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు - విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ తుపాను ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, భీకర గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. తుపాను నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ సూచించారు. పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు, పనిముట్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారుల నుంచి వచ్చే సూచనలను పాటించాలని కోరారు.

విద్యుత్ సమస్యల కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు..

అక్వాన్ తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రత్యేక కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటు చేసింది. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా, విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైనా ఈ నంబర్లను సంప్రదించవచ్చునని సూచించింది.

టోల్ ఫ్రీ నంబర్ : 1912, కృష్ణా : 6281709355, ఎన్టీఆర్ : 9440817561, గుంటూరు : 9440817526, బాపట్ల : 9281413774, ప్రకాశం : 9440817491, పల్నాడు : 7382623148, మార్కాపురం : 7780420711, సీఆర్డీఏ: 8331092947.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు : ప్రణవ్ గోపాల్



విశాఖపట్నం (చైతన్యరథం): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాట్లాడే నైతిక హక్కు లేదని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ చేస్తున్న విమర్శలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయేలా చేసి, ఇప్పుడు విద్యార్థుల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.4 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. మరోవైపు ప్రచార ఆర్భాటాలు, వ్యక్తిగత ప్రచారానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన జగన్.. విద్యార్థుల ఫీజుల చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. బకాయిలు పెట్టి ఇప్పుడు బుకాయించడం జగన్ నైజమని ప్రణవ్‌గోపాల్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నరేళ్ల కాలంలోనే సుమారు రూ.5 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేసిందని ప్రణవ్‌గోపాల్ తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బకాయిలు పేరుకుపోతే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని చెల్లిస్తూ విద్యార్థులకు భరోసా కల్పిస్తోందని అన్నారు. వైసీపీ పాలనలో ప్రచార ఆర్భాటానికే ప్రాధాన్యం ఇచ్చారని, కూటమి ప్రభుత్వం మాత్రం అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

ఏపీలో ఓఎన్‌జీసీ బావి నుంచి భారీగా గ్యాస్ లీక్...

చదరపు కిలోమీటర్ పరిధి ఖాళీ, ఘాటు వాసన



కోనసీమ (చైతన్యరథం): కోనసీమ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున భారీ గ్యాస్ లీకేజీ ఉదంతం చోటుచేసుకుంది. రాజోలు నియోజకవర్గంలోని మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని తాడివారి మెరక ప్రాంతంలో ఉన్న ఓఎన్జీసీ రీడ్రిల్లింగ్ బావి నుంచి ఒక్కసారిగా హైప్రెషర్‌తో కూడిన గ్యాస్ లీక్ అయింది. ఈ ఆకస్మిక పరిణామంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పరిస్థితి తీవ్రతను గ్రహించిన జిల్లా యంత్రాంగం, ప్రాణనష్టం జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంది. గతంలో మూసివేసి ఉంచిన ఈ బావిలో ఓఎన్జీసీ ఇటీవల రీడ్రిల్లింగ్ పనులు ప్రారంభించింది. ఈ తెల్లవారుజామున పనులు కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ బయటకు ఎగజిమ్మింది. దీనికి ఈదురుగాలులు తోడు కావడంతో ఈ గ్యాస్ క్షణాల్లో విస్తరించింది. గ్యాస్ వాసన తీవ్రం కావడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఊపిరి పీల్చడంలో ఇబ్బందులకు గురయ్యారు. ఘాటువాసన పరిసర ప్రాంతాలను ఆవరించింది.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

సమాచారం అందుకున్న వెంటనే ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులు, జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అత్యవసర సహాయక చర్యలు చేపట్టారు. ఈ గ్యాస్ లీకేజీని అరికట్టడానికి ఓఎన్జీసీ అధికారులు నర్సాపురం నుంచి ప్రత్యేక బ్లోఅవుట్ కంట్రోల్ బృందాన్ని రప్పించారు. ఈ బావికి మంటలు అంటుకోకుండా ఉండటానికి అగ్నిమాపక సిబ్బందిని భారీగా మోహరించారు. నిప్పు రవ్వలు చెలరేగితే భారీ అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున, ముందుజాగ్రత్తగా బావి చుట్టూ వాటర్ అంబ్రెల్లాను ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా గ్యాస్ వ్యాపిస్తున్న ప్రాంతంలో నిరంతరం నీటిని పిచికారీ చేస్తూ మంటలు చెలరేగకుండా అడ్డుకుంటున్నారు. బావి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బావి నుంచి ఒక చదరపు కిలోమీటర్ల మేర ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. జాతీయ రహదారి 216 బైపాస్ మార్గంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్థానిక ప్రజలు ఇళ్లలో వంట గ్యాస్ స్టవ్ లేదా ఎలాంటి నిప్పు సంబంధిత వస్తువులను వెలిగించవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం ఓఎన్జీసీ నిపుణులు, బ్లోఅవుట్ కంట్రోల్ టీమ్స్ పరిస్థితిని పూర్తిగా తమ అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తోన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తోన్నారు. గ్యాస్ లీకేజీ సంపూర్ణంగా నిలిచిపోయి, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించారు. ఒఎన్‌జీసీ చైర్మన్, సంస్థ సీనియర్ అధికారులతో మాట్లాడారు. లీకేజీని అదుపు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఉన్నతాధికారులను అడిగి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. స్థానిక ప్రజల ప్రాణ భద్రతకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాద ప్రాంతానికి సమీపంలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అమరావతిలో మీడియా సిటీ... రూ.5 వేల కోట్ల పెట్టుబడులు

● లక్ష ఉద్యోగాల కల్పనకు మాస్టర్ ప్లాన్... యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ అండ్ ఎక్సటెండెడ్ రియాలిటీ పాలసీ... ఈ నెల 10న జరిగిన కేబినెట్ భేటీలో ఆమోద ముద్ర



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో మీడియా సిటీని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ అండ్ ఎక్సటెండెడ్ రియాలిటీ పాలసీ కింద భారీగా పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 100 కంపెనీల పెట్టుబడులు ఆకర్షించాలన్నద లక్ష్యంగా పెట్టుకుంది. వాటి ద్వారా లక్ష మందికి ఉపాధి అవకాశాలు సృష్టించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ నెల 10న సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ విధానానికి ఆమోద ముద్ర పడింది. కొత్త టెక్నాలజీకి ఏపీ కేంద్ర బిందువుగా ఉండే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్ (విజువల్ ఎఫెక్ట్స్), కామిక్స్, ఎక్సటెండెడ్ రియాలిటీ రంగాన్ని పెద్ద ఎత్తున డెవలప్‌మెంట్ చేయాలనే లక్ష్యంతో సరికొత్త 'ఏవీజీసీ-ఎక్స్ఆర్ విధానం 2026-31'ను ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ కొత్త పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్లలో రాష్ట్రానికి ఏకంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ సర్కార్ పెద్ద ప్రణాళికను రెడీ చేసింది. ఈ నెల 10న సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ విధానానికి ఆమోద ముద్ర పడగా... తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.

200 ఎకరాల విస్తీర్ణంలో మీడియా సిటీ...

ఈ పాలసీలో భాగంగా రాజధాని అమరావతిలో సుమారు 200 ఎకరాల స్థలంలో 'మీడియా సిటీ' ఏర్పాటు కానుంది. ఇందులో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన అత్యాధునిక ఏవీజీసీ-ఎక్స్ఆర్ పార్క్‌ను డెవలప్ చేయనున్నట్టు తెలుస్తుంది. ఈ ప్రాజెక్టు మౌలిక వసతుల కల్పన, డెవలప్‌మెంట్ బాధ్యతలను ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థకు ప్రభుత్వం అప్పగించడం జరిగింది.

భారీగా రాయితీలు...

ఈ ఐదేళ్ల (2026 నుంచి 2031) పాలసీ ద్వారా ఐదు భారీ యాంకర్ యూనిట్లను, కనీసం వంద కొత్త కంపెనీలను రాష్ట్రానికి రప్పించాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. దీని కోసం పరిశ్రమలు స్థాపించే సంస్థలకు కనీవినీ ఎరగని రీతిలో భారీ ప్రోత్సాహకాలను, రాయితీలను ప్రకటించింది. ఏవీజీసీ-ఎక్స్ఆర్ మౌలిక సదుపాయాల కల్పన ఖర్చులో సగం అంటే 50 శాతం రాయితీ (గరిష్ఠంగా రూ.2 కోట్లు వరకు) ఇవ్వనున్నట్టు సమాచారం. అదేవిధంగా పార్కుల అభివృద్ధి ప్రాజెక్టు ఖర్చులో 25 శాతం (గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు) భారీ సబ్సిడీని ప్రభుత్వం ఇవ్వనుంది. వీటితో పాటు పరిశ్రమల స్థాపనకు ఊతమిచ్చేలా ఐదేళ్లపాటు వంద శాతం రాష్ట్ర జీఎస్టీ వాపస్, స్టాంప్ డ్యూటీ నుంచి పూర్తి మినహాయింపు వంటి ఆకర్షణీయమైన ప్రయోజనాలను కూడా కల్పించే అవకాశం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో సెమీ కండక్టర్లు, రోబోటిక్స్ రంగాల డెవలప్‌మెంట్‌కి సంబంధించిన ప్రత్యేక విధానాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఈ ఏవీజీసీ-ఎక్స్ఆర్ పాలసీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి కల్పనపై ఏపీ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోంది. ఏదిఏమైనా దేశంలోనే గేమింగ్, యానిమేషన్ హబ్‌గా అమరావతి మారేందుకు ఈ పాలసీ బాటలు వేయనుంది.



వైసీపీకి రెల్లి సామాజికవర్గం నుంచి భారీ షాక్!

●టీడీపీలో చేరిన 200 కుటుంబాలు

●కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి నిమ్మల రామానాయుడు

●రెల్లి సామాజికవర్గ కళ్యాణ మండపానికి రూ.కోటి మంజూరుపై హర్షం

● ఏడాది చివరికల్లా కళ్యాణ మండప నిర్మాణ పనులు: మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): పాలకొల్లులో వైసీపీకి చెందిన రెల్లి సామాజికవర్గం నుంచి పెద్దఎత్తున టీడీపీలో చేరికలు జరిగాయి. ఆ సామాజికవర్గానికి చెందిన 200 కుటుంబాలు మూకుమ్మడిగా వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాష్ట్ర కూటమి ప్రభుత్వ పనితీరు, మంత్రి నిమ్మల రామానాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ముఖ్యంగా రెల్లి సామాజికవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన కళ్యాణ మండప నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించడంపై కృతజ్ఞత వ్యక్తం చేశారు. పాలకొల్లులోని మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారందరికీ మంత్రి నిమ్మల రామానాయుడు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రెల్లి సామాజికవర్గానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధనాల దుర్గమ్మ, ధనాల శ్రీనివాస్, మరడాపు గణేష్‌తో పాటు పాలకొల్లు పట్టణ కూల్‌డ్రింక్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది దేవి వరప్రసాద్ తదితరులు ఉన్నారు. వీరిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... సమాజంలో వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు ఎంత అవసరమో పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న రెల్లి సామాజికవర్గీయుల సేవలు అంతకంటే ముఖ్యమైనవని కొనియాడారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో, పట్టణాల పరిశుభ్రతలో వారి కృషి వెలకట్టలేనిదన్నారు. తనకు మొదటి నుంచి రెల్లి సామాజికవర్గ ప్రజలంటే ప్రత్యేక అభిమానం, ప్రేమ ఉన్నాయని పేర్కొన్నారు. వారి అభ్యున్నతికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. రెల్లి సామాజికవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళ్యాణ మండప నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించానని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది చివరికల్లా కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. రెల్లి సామాజికవర్గ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. వైసీపీని వీడి 200 కుటుంబాలు టీడీపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. భవిష్యత్తులోనూ వారి నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ఈ ప్రయాణంలో ప్రజలందరి అండదండలు అవసరమని కోరారు. రెల్లి సామాజికవర్గ నాయకుడు ధనాల శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలిపేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపే నాయకుడితో కలిసి పయనించడం ఆనందంగా ఉందన్నారు. తమ సామాజికవర్గం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళ్యాణ మండప నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయించడం మరువలేని విషయమన్నారు. ఇందుకు రెల్లి సామాజికవర్గం మంత్రి నిమ్మలకు ఎప్పటికీ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంపై విశ్వాసంతోనే 200 కుటుంబాలు టీడీపీలో చేరాయని తెలిపారు.

కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు : వై.వీ.బీ రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు: ఉయ్యూరు టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బి. రాజేంద్రప్రసాద్‌ని వారి స్వగృహంలో కలిసి తమ సమస్యలను వివరించారు. టాక్సీ స్టాండ్ ఏర్పాటు, కార్ల పార్కింగ్‌కు స్థలం, రాత్రిపూట డ్రైవర్లకు భద్రత కల్పించడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద టాక్సీ డ్రైవర్లకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్‌ని కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న రాజేంద్ర ప్రసాద్ గారు ప్రతి సమస్యపై వారితో చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, టాక్సీ డ్రైవర్లకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా టాక్సీ స్టాండ్, పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రాత్రి వేళల్లో డ్రైవర్ల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను రాజేంద్రప్రసాద్ కోరారు. పేద టాక్సీ డ్రైవర్లకు పింఛన్లు అందించాలన్న వారి విజ్ఞప్తిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాజేంద్రప్రసాద్ హామీ ఇచ్చారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

ప్రజలకు మెరుగైన పాలన అందించాలి

●రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబును కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ

●స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లకు ఎంపీ అభినందనలు



కాకినాడ (చైతన్యరథం): ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి పెద్దాపురం, సామర్లకోట, ఏలేశ్వరం మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కౌన్సిలర్లు మంగళవారం రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబును కొప్పవరంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా, పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజా, జనసేన పెద్దాపురం అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుమారుడు నిమ్మకాయల రంగనాగ్, జనసేన నాయకులు నెక్కంటి సాయి ప్రసాద్, సరోజ్ వాసు, ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ యార్లగడ్డ అక్షిత పాల్గొన్నారు. అలాగే ఏలేశ్వరం కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, పాండ్రంకి రామ్మోహన్ రావు, పరవాడ రమేష్, జొన్నాడ వీరబాబు, పలివెల వెంకటేష్, ఎండగుండి నాగబాబు, శంకాని భారతి, ఇంజరపు లక్ష్మి, కర్రోతు దేవి, వార్డు నాయకులు సామంతుల గోపి, మావిడి లలిత, కోణాల వెంకటరమణతో పాటు పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలకు చెందిన విజేత కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులను ఎంపీ సానా సతీష్ బాబు అభినందించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' నినాదానికి అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజలకు చేరువ చేయాలని తెలిపారు. ప్రజలకు అందించే మెరుగైన పాలన ద్వారా ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెంపొందించేలా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

గ్రామాలను అభివృద్ధి బాటలోకి నడిపిస్తాం

● వేములపల్లిలో సర్పంచ్ అభ్యర్థి కిలపర్తి చిన్నమ్మలుకు మద్దతుగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విస్తృత ప్రచారం



శృంగవరపుకోట (చైతన్యరథం): మండల పరిధిలోని వేములపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సర్పంచ్ అభ్యర్థి కిలపర్తి చిన్నమ్మలుకు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ (DCMS) చైర్మన్ గొంప కృష్ణ మరియు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధిలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకున్న నాయకులు, రానున్న పంచాయతీ ఎన్నికల్లో చిన్నమ్మలును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ... వేములపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలంటే సమర్థవంతమైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూడటంలో కిలపర్తి చిన్నమ్మలు ముందుంటారని వారు గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి, గ్రామ అభివృద్ధి కోసం తమ అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామంలోని స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం సభ్యులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి తమ పూర్తి మద్దతును ప్రకటించారు.

ఫారం - బీ అనుబంధ పత్రాలు సమర్పించిన కిడారి శ్రావణ్

పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఫారం-బీ, అనుబంధ పత్రాలను ఎమ్మెల్యే కిడారి శ్రావణ్‌కుమార్ అందించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు సంబంధించిన ఫారం-బీ Annexure-1, Annexure-2, Annexure-3 పత్రాలను మన్యం జిల్లా ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్‌కి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పార్టీ అధికారిక పత్రాలను నిబంధనల ప్రకారం సమర్పించారు.

ఏపీలో ఈనెల 26న సెలవు... 23 కార్పొరేషన్లు మున్సిపాలిటీల్లో ఎన్నికలు



అమరావతి (చైతన్యరథం): ఏపీలో రెండో విడత మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 26న రాష్ట్రంలోని నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, మరో 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు కలిపి మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్య సంస్థలకు ప్రభుత్వం (AP Govt) ఈ నెల 26న సెలవు (Holiday) ప్రకటించింది. అలాగే ప్రైవేటు ఉద్యోగులకు కూడా వేతనంతో కూడిన సెలవు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పుడు రెండో విడతలో 23 చోట్ల ఎన్నికలు జరగబోతున్నాయి. వీటిలో శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఆముదాలవలస, అల్లూరు, రాజాం, బి. కొత్తపేట, తాడిగడప, భీమవరం, తణుకు, తాడేపల్లి గూడెం, పాలకొల్లు, గుడివాడ,, చింతలపూడి, నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల, కందుకూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఈ నెల 26న ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఈ నెల 26న ఈ 23 చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇతర విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలకు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించింది. వాణిజ్య సముదాయాలు తమ ఉద్యోగులకు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం ప్రకారం వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ శాఖల వాహనాలను పోలింగ్ అవసరాల కోసం ప్రభుత్వానికి అప్పగించాలని కూడా ఉత్తర్వులు ఇస్తున్నారు. దీంతో పోలింగ్ రోజు స్వేచ్ఛగా ఓటింగ్ జరిగేలా ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది.

తిరువూరు నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వైసీపీ శ్రేణుల చేరికలు

●ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు



విజయవాడ (చైతన్యరథం): తిరువూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం బలపడుతోందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, ఏ.కొండూరు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం విజయవాడ లోని ఎంపీ కార్యాలయం నందు టీడీపీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామానికి చెందిన 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన బల్లెపోగు బాబురావు తన అనుచరులతో కలిసి మొత్తం 25 మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటాయని తెలిపారు. పార్టీలోకి వచ్చిన వారిని కొత్తవారిగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావిస్తామని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయపురం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మామిడి గాంధీ, తిరువూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు తుమ్మలపల్లి వెంకట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు మండలంలోనూ వైసీపీ నాయకులు, కార్యకర్తల చేరికలు

మరోవైపు ఏ.కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సైతం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మొత్తం 20 మంది టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరగా, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఏ.కొండూరు మండలంలో వైసీపీలో కీలకంగా వ్యవహరించిన మంచి కంటి రాజశేఖర్, ఆయన సతీమణి విజయలక్ష్మి, మెంతుల శ్రీనివాస్ యాదవ్, బాలమర్తి కృష్ణ తదితరులు టీడీపీలో చేరడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ నెల 26న అంబేద్కర్ స్మృతి వనంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

విజయవాడ (చైతన్యరథం): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం అజిత్‌సింగ్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మౌలిక విలువలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ, రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నవంబర్ 26న జరిగే రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు

తెలుగుదేశం కూటమి అభ్యర్థులను గెలిపించండి: పాతర్ల రమేష్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా మంగళవారం మంగళగిరి 21 డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ తెలుగుదేశం మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండలును కార్పొరేటర్ అభ్యర్థి షేక్ రియాజ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని 21 డివిజన్ ప్రజలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాతర్ల రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్. రాష్ట్ర ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం, మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ జిలాని. మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ. ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీలో భారీగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలు

- **రాష్ట్రంలో ఆహార ద్రవ్యోల్బణం 13.23 శాతానికి చేరుకుని దేశంలోనే అత్యధికంగా నమోదు**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అక్టోబర్ 2026లో రాష్ట్రంలో ఆహార ద్రవ్యోల్బణం 13.23 శాతానికి చేరుకుని దేశంలోనే అత్యధికంగా నమోదైంది. సెప్టెంబర్‌లో 10.2 శాతం ఉన్న ఈ రేటు ఒక్క నెలలోనే మరో మూడు శాతం పైగా పెరిగింది. జాతీయ సగటు 8.94 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్ దానికంటే 4.29 శాతం ఎక్కువగా ఉంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు 12.37%, కర్ణాటక 12.16%, ఒడిశా 11.66%, తెలంగాణ 10.92% కంటే కూడా ఎక్కువగా నమోదైంది.ఈ ధరల పెరుగుదల ప్రభావం సాధారణ ప్రజల రోజువారీ ఖర్చులపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా బయట తినేవారిని, విద్యార్థులు, నిరుద్యోగ యువతని ఇబ్బంది పెడుతోంది. మూడు నెలల క్రితం కిలో నాణ్యమైన బియ్యం దాదాపు రూ.70 ఉండగా, ఇప్పుడు రూ.90 దాటింది. వంట నూనె ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. గుడ్లు ఒక్కోటి రూ.8 దాటాయి. కందిపప్పు కిలో రూ.180 నుంచి రూ.200 వరకు చేరింది. ఉల్లిపాయల ధరలు గతేడాదితో పోలిస్తే 116 శాతం, వెల్లుల్లి 60 శాతం, అల్లం 48 శాతం, నిమ్మకాయలు 47 శాతం పెరిగాయి. ఈ ముడి సరుకుల ధరల పెరుగుదల హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్డు పక్కని టిఫిన్ సెంటర్లపై ప్రత్యక్ష ప్రభావం చూపింది.

ఇంటి బడ్జెట్‌పై పెరిగిపోతున్న ఒత్తిడి

యజమానులు నిర్వహణ ఖర్చులు భరించలేక మెనూ ధరలు పెంచాల్సి వచ్చింది. గతంలో రూ.120 నుంచి రూ.150 ఉండే భోజనం ధర ఇప్పుడు 10 నుంచి 15 శాతం పెరిగింది. ఇడ్లీ, దోశ వంటి టిఫిన్ల ధరలు కూడా పెరిగాయి. ఒక కప్పు టీ గతంలో రూ.10-15 ఉండగా ఇప్పుడు రూ.20 వరకు చేరింది. చిన్న హోటళ్ల యజమానులు లాభాలు తగ్గిపోయాయని, కేవలం నిర్వహణ ఖర్చులు తీర్చుకోవడానికే ధరలు పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది సాధారణ ప్రజలు, విద్యార్థులు అన్నా క్యాంటీన్ల వైపు మళుతున్నారు. ఇంట్లో వంట చేసుకోవడం కష్టం అయినవారు హోటళ్లకు వెళ్లలేకపోతున్నారు. ధరల పెరుగుదలకు కారణాలుగా సరఫరా సమస్యలు, వాతావరణ ప్రభావాలు, ఇటీవలి తుఫాను భయాలతో ప్రజలు స్టాక్ చేసుకోవడం వంటివని చెబుతున్నారు. ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై ఉల్లిపాయలు అందిస్తున్నా, నాణ్యత కోసం చాలా మంది మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటం వల్ల ఇంటి బడ్జెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది. మధ్యతరగతి కుటుంబాలు ఖర్చులు కుదించుకోవాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నా, మార్కెట్‌లో ప్రభావం ఇంకా కనిపించడం లేదు. సాధారణ ప్రజలు ధరలు తగ్గాలని ఆశిస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

- **వైద్యం కోసం ఏ ఒక్కరూ అప్పుల పాలుకాకూడదు**
- **గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**
- **40 మందికి రూ.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**



గుంటూరు (చైతన్యరథం): ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంలా నిలుస్తామని,, సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదల ఆరోగ్యానికి భరోసాగా ఉంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 40 మందికి రూ. 30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నిరుపేదల ప్రాణాలను నిలబెట్టడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా మారిందని చెప్పారు. నియోజకవర్గంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం నుంచి సహకారం లభిస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు తూర్పు నియోజకవర్గంలో15.50 కోట్ల నిధులు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ సరైన వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని వేగవంతంగా అందిస్తోందన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందడంలో తీవ్ర జాప్యం జరిగేదని, అయితే ఇప్పుడు దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నేరుగా బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు మరియు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది అప్పులపాలైన కుటుంబాలకు ఈ సహాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

ఏకగ్రీవం చేస్తే... గ్రామాభివృద్ధికి రెండెకరాల భూమి

రౌతులపూడి (చైతన్యరథం): కాకినాడ జిల్లాలోని రౌతులపూడి సర్పంచి పదవిని తమకు ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి రెండు ఎకరాల భూమిని ఇస్తామని చింతకాయల వేంకట సుబ్బలక్ష్మి, వాసిరెడ్డి శోభన్ బాబు కృష్ణ (విష్ణుమూర్తి) దంపతులు తెలియజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పరుస్తామని, స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామ పెద్దలు తమకు ఈ అవకాశం కల్పించాలని కోరారు.



టీడీపీ - వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ... టీడీపీ శ్రేణులకు గాయాలు... పరామర్శించిన ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట (చైతన్యరథం): మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన గ్రామ పంచాయతీల నామినేషన్ స్వీకరణ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈనేపథ్యంలో పలువురు టీడీపీ శ్రేణులకు తీవ్రగాయాలయ్యాయి. కొండకావూరు, పమిడిమర్రు, చింతలపాలెం, గురవాయపాలెం గ్రామాలకు సంబంధించి కోటప్పకొండలోని కొండకావూరు సచివాలయంలో అధికారులు నామీనేషన్ల స్వీకరణ కేంద్రం ఏర్పాటు చేశారు.

కర్రలతో దాడులు :

మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొండకావూరు గ్రామ సర్పంచిగా నామినేషన్ వేసేందుకు వచ్చిన వైఎస్సార్సీపీకి చెందిన అభ్యర్థి, వార్డు సభ్యులు కేంద్రానికి వచ్చారు. అదే సమయంలో టీడీపీ వర్గీయులు అక్కడే ఉన్నారు. ఈక్రమంలో తాము ముందు వెళ్లాలంటే తామంటూ ఇరుపార్టీల సభ్యులు వాగ్వాదానికి దిగిన నేపథ్యంలో ఈ ఘర్షణ చోటు చేసుకొని ఒకరిపై ఒకరు కర్రలతో దాడులు చేసుకునే వరకు వెళ్లింది. వివాదంలో టీడీపీ వర్గీయులకు చెందిన కారును వైసీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి ఒక్కొక్కరితో నామినేషన్లు దాఖలు చేయించారు.

టీడీపీ వర్గీయులతో వాగ్వాదం :

చిన్నతురకపాలెంలో వైసీపీ వర్గీయులు నామినేషన్ వేసేందుకు కేంద్రానికి వచ్చారు. ఈక్రమంలో టీడీపీ వర్గీయులతో వాగ్వాదం జరిగింది. ఘటనలో టీడీపీ నాయకుడికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే పెట్లూరివారిపాలెం నుంచి వైసీపీ మద్దతుదారులు కాకాని గ్రామంలో కేంద్రానికి చేరుకోగా టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అందరినీ పంపించారు.

టీడీపీ శ్రేణులకు తీవ్రంగా గాయ్యాలు :

అనంతరం అభ్యర్థితో పాటు మద్దతుదారులను పంపి నామినేషన్లు దాఖలు చేయించారు. టీడీపీ, వైసీపీ మధ్య ఆయా గ్రామాల్లో జరిగిన ఘర్షణలలో టీడీపీ శ్రేణులకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈనేపథ్యంలో గాయాలైన టీడీపీ శ్రేణులను చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న పలుగ్రామాల టీడీపీ నాయకులను నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అరవింద బాబు హామీ ఇచ్చారు.

డెంగ్యూ, మలేరియా నివారణకు నెల్లూరులో ప్రత్యేక కార్యాచరణ

- **65వ డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ప్రారంభం**



నెల్లూరు (చైతన్యరథం): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నగరంలోని 65వ డివిజన్‌లో కార్పొరేటర్ ధర్మవరం గణేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ ఆదేశాలు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్‌లోని మురుగునీటి కాలువల్లో పూడికతీత, వ్యర్థాల తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేపట్టనున్నారు. బుధవారం నుంచి యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దోమల ఉత్పత్తిని అరికట్టి డెంగ్యూ, మలేరియా వ్యాప్తిని నియంత్రించడంతో పాటు టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించి డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోసెస్, జనరల్ సెక్రటరీ కలవకుంట్ల భాస్కర్, బూత్ ఇన్‌ఛార్జి శ్రీమంతుల నాగార్జున, కాంచి కృష్ణ, శ్రీమంతుల సుబ్బారావు, శానిటేషన్ సూపర్‌వైజర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 70 కుటుంబాలు

రాజాం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు వైకాపాని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాజాం పట్టణం 30వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన 70 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. శ్యాంపురం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో వీరిని సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కోండ్రు వారికి పార్టీ కండువాలు వేశారు. ఈసందర్భంగా



ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేడు మాటల్లోనే కాదు చేతల్లోను చెప్పాం.. చేస్తున్నాం..' అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కారుకి ట్రాక్టర్‌ను అడ్డుగా నిలిపిన వైసీపీ నేతలు

నాగులుప్పలపాడు (చైతన్యరథం): ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామంలో టీడీపీ నాయకుడు కారుకి వైసీపీ నేతలు ట్రాక్టర్‌ను అడ్డుగా నిలిపి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తెదేపా నాయకుడు ముద్దన రవి సోమవారం రాత్రి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ వద్ద నిలిపిన చెత్త సేకరణ ట్రాక్టర్‌ను వైసీపీ నాయకులు ముద్దన రవి కారుకి అడ్డుగా నిలిపి భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. సదరు సంఘటనపై రవి నాగులుప్పలపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం

- ధీమా వ్యక్తం చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- అవుకు మండల అండ కూటమి నాయకులతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష



బనగానపల్లె (చైతన్యరథం): రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఘనవిజయం సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉందని, ప్రజల ఆశీస్సులతో గ్రామస్థాయిలోనూ కూటమి విజయపరంపర కొనసాగుతుందని పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణ శివారులోని కాపులపల్లె ఫాంహౌస్‌లో అవుకు మండలానికి చెందిన ఎన్డీఏ కూటమి నాయకులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న సానుకూలత పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రతిబింబిస్తుందని అన్నారు. గ్రామస్థాయిలో కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. అవుకు మండలంలోని ప్రతి గ్రామంలో ఎన్డీఏ కూటమి బలాన్ని మరింత పెంచుతూ, బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

నూతన కార్పొరేటర్ శైలజ యాదవ్ దంపతులకు సన్మానం



కర్నూలు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు వై.శైలజ యాదవ్ కర్నూలు పట్టణంలోని 36 వార్డు నూతన కార్పొరేటర్‌గా ఎన్నికైనందున శైలజ యాదవ్, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నూలు ఉమ్మడి జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వర యాదవ్ దంపతులకు ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగ శాలువా బొకేలతో ఘనంగ సన్మానించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగ నాగేశ్వర యాదవ్ దంపతుల కుటుంబం బడుగు బలహీన వర్గల అభివృద్ధికి సంక్షేమనికి కృషిచేస్తున్నారని వారు కొనియాడారు.

ఘనంగా శ్రీ సత్యసాయి శత జయంతి ముగింపు వేడుకలు



ఉరవకొండ (చైతన్యరథం): శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ముగింపు వేడుకలు అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాబా అవతార ప్రకటన క్షేత్రంలో ఆయన చిన్ననాటి పాలరాతి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏడాది క్రితం దేశ నలమూలల నుంచి ప్రారంభమైన సత్యసాయి ప్రేమవాహిని ఐదు రథాలను ఉరవకొండలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉరవకొండలోని జాతీయ రహదారిలో మూడు రోడ్ల కూడలి వద్ద సత్య సాయి ప్రేమ వాహిని రథయాత్ర ముగింపు కార్యక్రమాన్ని అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాబా సేవా సంస్థల అఖిల భారత అధ్యక్షుడు నిమిష్ పాండ్య, జాతీయ సమన్వయకర్త కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కో ఆర్డినేటర్లకు వేతనాలు పెంపు

ఆంధ్రప్రదేశ్‌లోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కో-ఆర్డినేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న వేతనాల పెంపుకు ఆమోదం తెలుపుతూ, ఏకంగా 23 శాతం జీతాలను పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట కలగనుంది. స్వర్ణ గ్రామ, వార్డు విభాగంలో ఈ కో-ఆర్డినేటర్లను 2020 సంవత్సరంలో నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వారి వేతనాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభుత్వం ఇప్పుడు వారి సేవలను గుర్తించి, వేతనాలను సవరిస్తూ నిర్ణయం తీసుకోవడం విశేషం.

నామినేషన్ల స్క్రూటీని... నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద వైసీపీ నేత హల్‌చల్



నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హల్‌చల్ చేశారు. 3 రోజుల నుంచి జరిగిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో మంగళవారం ఉదయం నుంచి నామినేషన్ల పరిశీలన (స్క్రూటీ) జరుగుతోంది. ఈనేపథ్యంలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైకాపా కార్యకర్తలతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. స్క్రూటీ నిర్వహిస్తున్న అధికారుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసులు ఆయన్ను ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను స్క్రూటీలో తొలగిస్తున్నారని గోపిరెడ్డి ఆరోపించారు. 14వ వార్డు వైసీపీ అభ్యర్థి నామినేషన్ను ఎందుకు తిరస్కరించారో మున్సిపల్ కమిషనర్ మాట్లాడాలని వాగ్వాదానికి దిగారు. పోలీసులు అందుకు అంగీకరించకపోవడంతో కార్యకర్తలతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చివరకు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మాత్రమే మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. కార్యాలయంలో నుంచి బయటకు వచ్చిన తర్వాత అక్కడి నుంచి పోలీసు వాహనంలో తరలించారు.

కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పాత 47వ డివిజన్ ((ప్రస్తుత 68వ డివిజన్)లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి బేసరి కమలాదేవికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా కూటమి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవికి మద్దతుగా కూడా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. స్థానిక నాయకులు, కూటమి పార్టీల కార్యకర్తలతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్.. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ముఖ్యంగా ఈ డివిజన్‌లో మంజూరైన నిధులు, పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, త్వరలో ప్రారంభించనున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు వివరించారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత - 40 మందికి కడుపునొప్పి, వాంతులు

అనంతపురం జిల్లా (చైతన్యరథం): గుమ్మగట్ట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. తెల్లవారుజామున సుమారు 40 మంది విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కావడంతో ఆందోళన నెలకొంది. గుమ్మగట్ట కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 279 మంది విద్యార్థినులు ఉండగా, ఈరోజు 263 మంది హాజరయ్యారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో సుమారు 40 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే గుమ్మగట్ట పీహెచ్‌సీ నుంచి వైద్య బృందం పాఠశాలకు చేరుకుని చికిత్స అందించారు. అస్వస్థతకు గురైన వారిలో కొంతమంది విద్యార్థినులను మెరుగైన చికిత్స కోసం గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగిలిన విద్యార్థినులకు పాఠశాల ప్రాంగణంలోనే చికిత్స అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఎవరికీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలపై జిల్లా విద్యాశాఖ అధికారి విచారణకు ఆదేశించారు. ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, నిల్వ, వడ్డింపు తదితర అంశాలపై విచారణ చేపట్టారు. జీసీడీవో, ఎంఈవో, ఏపీసీలు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. డీఎండహెచ్‌వో కూడా వైద్యులతో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ తెలిపింది. విద్యార్థినుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు :

విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు కేజీబీవీని, గుమ్మగట్ట ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వైద్యులను ఆదేశించారు. ఆహార కలుషితంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరుపుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో కేజీబీవీలో చదివిస్తున్నారని కానీ ఇలా జరగడం చాలా బాధాకరమని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వారి ఆరోగ్య పరిస్థితులపై చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ఘటనపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి భోజనం తిన్న తర్వాత 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కొంతమంది విద్యార్థులను గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించగా, మిగిలిన విద్యార్థులకు వసతిగృహంలోనే అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, పరిస్థితి అదుపులోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. పాఠశాలలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

మంత్రాలయంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



మంత్రాలయం (చైతన్యరథం): మంత్రాలయం టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి వారి సోదరులు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి సమక్షంలో పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారాయణ, నాగరాజు, లక్ష్మన్న, అంజినయ్య, హనుమంతు రెడ్డి, రాముడు, లింగమూర్తి, రామలింగారెడ్డి, హనుమంతు, వీరారెడ్డి తదితరులు సుమారు 50 కుటుంబాలకు చెందిన పలువురు కీలక వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఇన్‌ఛార్జ్ సొసైటీ చైర్మన్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో తమ గ్రామాల్లో టీడీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, పార్టీ అభ్యర్థికి భారీ మెజారిటీ అందించే బాధ్యతను తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తానా ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ మెన్స్ డే'

పెన్సిల్వేనియా: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్-అట్లాంటిక్ ఆధ్వర్యంలో పెన్సిల్వేనియా రాష్ట్రంలోని కాలేజ్ విల్లేలో 'ఇంటర్నేషనల్ మెన్స్ డే'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారికి ఈషా ఫౌండేషన్ సహకారంతో యోగా నమస్కార్, నాడీ శుద్ధి, మిరాకిల్ ఆఫ్ మైండ్ మెడిటేషన్ వంటి యోగా, ధ్యాన ప్రక్రియలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అమూల్యమైన సహకారం అందించిన ఈషా ఫౌండేషన్‌కు, ముఖ్యంగా శ్రీదేవి, గజేంద్ర బాబులకు, తరగతులను అత్యంత నైపుణ్యంతో, అంకితభావంతో, స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన శిక్షకులు ఆరోన్ ఆడమ్స్, చిరంజీవి కంచర్లలకు తానా బృందం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. వారి అనుభవం, మార్గదర్శకత్వం, జ్ఞానం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగపడ్డాయని నిర్వాహకులు పేర్కొన్నారు. వేదికను ఉదారంగా అందించి సహకరించిన ఉదయ్ సుంకరకు, వలంటీర్లకు, ఇతరులకు తానా నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తానా మిడ్-అట్లాంటిక్ బృందం ఇలాంటి ప్రయోజనకరమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించడంపై తానా బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరి సంతోషం వ్యక్తం చేయడంతో పాటు అందరికీ అభినందనలు తెలిపారు. తానా మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి, సతీష్ తుమ్మల, సురేష్ యలమంచి, రంజిత్ మామిడి, కృష్ణ నందమూరి కార్యక్రమ నిర్వహణకు విశేష కృషి చేశారు. కమ్యూనిటీ అభివృద్ధికి తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లవేళలా అండగా ఉంటున్న తానా అగ్ర నాయకులకు, రుచికరమైన భోజనాలు అందించిన వారికి, ఇతరులకు తానా మిడ్-అట్లాంటిక్ బృందం కృతజ్ఞతలు తెలియజేసింది.





ఫ్రిస్కోలో స్వర ఝరి

శివమణి డ్రమ్స్ హోరు... యువ కళాకారుల జోరు... ఉర్రూతలూగించిన 'టుగెదర్ రీలోడెడ్'

మాండలిన్ మాంత్రికుడికి సంగీత నీరాజనం.. ప్రసాద్ తోటకూరకు 'కమ్యూనిటీ ఇంపాక్టర్' పురస్కారం

ఫ్రిస్కో (టెక్సాస్): అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఫ్రిస్కోలో శుభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టుగెదర్ రీలోడెడ్' సంగీత విభావరి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు, స్థానిక యువ కళాకారులు కలిసి అందించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ప్రముఖ మాండలిన్ విద్వాంసుడు దివంగత యు. శ్రీనివాస్ అపూర్వ ప్రతిభను, ఆయన సంగీత వారసత్వాన్ని స్మరించుకుంటూ ఈ ప్రత్యేక నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రిస్కో ఇండిపెండెంట్ స్కూల్ డిస్ట్రిక్ట్ నూతనంగా నిర్మించిన అత్యాధునిక విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ వేదికగా జరిగిన ఈ వేడుకకు 800 మందికి పైగా సంగీతాభిమానులు హాజరయ్యారు.

ప్రపంచ ప్రఖ్యాత డ్రమ్మర్ శివమణి, మాండలిన్ రాజేష్, స్వామినాథన్ సెల్వగణేష్, ప్రవీణ్ నారాయణ్, బాలు రాజేంద్ర కురుప్, ముద్దుపాయ్, ప్రియా వసంత్ తదితర ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫ్రిస్కో పరిసర ప్రాంతాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు 25 మంది యువ సంగీత కళాకారులు వేదికను పంచుకున్నారు. కర్ణాటక, హిందుస్తానీ, ప్రపంచ సంగీతం, ఫ్యూజన్, సినీ సంగీత ప్రక్రియల సమ్మేళనంగా విభావరి కొనసాగింది. 'గిరిరాజ సుత తనయ', 'గీత గోవిందం' చిత్రంలోని 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే', 'దళపతి' చిత్రంలోని 'రాకమ్మ', హాలీవుడ్ చిత్రాలు 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్', 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' తదితర ప్రసిద్ధ సంగీత స్వరాలను కళాకారులు అద్భుతంగా ఆవిష్కరించారు. ముఖ్యంగా శంకరాభరణం చిత్రం లోని 'శంకరా నాదశరీరాపరా' గీతాన్ని వాద్య బృందం సమిష్టిగా ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను కట్టిపడేసింది. శివమణి ప్రత్యేక డ్రమ్స్ సోలో ప్రదర్శన, ఇతర తాళవాద్య కళాకారులతో కలిసి నిర్వహించిన జుగల్‌బందీ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

ఈ సందర్భంగా ప్రముఖ ప్రవాస భారతీయ నాయకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూరకు 'కమ్యూనిటీ ఇంపాక్టర్' అవార్డును శుభం ఫౌండేషన్ ప్రదానం చేసింది. విద్యా రంగానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఫ్రిస్కో ఐఎస్‌డీ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ మైక్ వాల్డిప్‌ను ఘనంగా సత్కరించారు.

ఫ్రిస్కో నగర మేయర్ మార్క్ హిల్ మాట్లాడుతూ.. సమాజం నుంచి పొందిన ప్రయోజనాలను తిరిగి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజ సేవలో ముందుండి నాయకత్వం వహిస్తున్న శుభం ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు గోపాల్ పోణంగిని ప్రత్యేకంగా అభినందించారు. గోపాల్ పోణంగి మాట్లాడుతూ... కళలను ప్రోత్సహించడం, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం, ఫ్రిస్కో ఐఎస్‌డీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం వంటి ప్రధాన సేవా కార్యక్రమాలను వివరించారు. వ్యాఖ్యాత అనీషా పోణంగి తన వ్యాఖ్యానంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుభం ఫౌండేషన్ డైరెక్టర్లు, ప్రధాన కార్యనిర్వాహక బృంద సభ్యులు మధుమతి వైశ్యరాజు, రాజా వైశ్యరాజు, విజయశ్రీ పోణంగి, మహేష్ చొప్పా సంగీత కళాకారులను సత్కరించారు.

ఉత్తర టెక్సాస్ ప్రాంతానికి చెందిన పలువురు ప్రముఖులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, విద్యారంగ నాయకులు హాజరయ్యారు. వారిలో రావు కల్వల (మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్), డాక్టర్ ప్రకాశరావు వెలగపూడి (GHHF), రఘువీర్ బండారు (TPAD), మాజీ ఎంపీ ఆత్మచరణ్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర అమెరికా పెట్టుబడుల ప్రధాన అనుసంధానకర్త సతీష్ మండువ, ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ అధ్యక్షుడు మహేంద్రరావు ఉన్నారు.








లండన్‌లో ఘనంగా బాలల దినోత్సవం

లండన్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (TAL) ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లండన్ బరో ఆఫ్ హౌన్స్‌లో ఫెల్థామ్ అసెంబ్లీ హాలులో జరిగిన వేడుకలకు సుమారు 300 కుటుంబాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టాలీవుడ్ గీతాలతో పాటు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. చిత్రలేఖనం, తెలుగు భాషా నైపుణ్యాలపై ప్రత్యేక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



భారతీయ సంస్కృతికి పట్టం

'తానా విశ్వ గురుకులం' విద్యార్థుల రామాయణం ప్రతిభా ప్రదర్శన





యూఎస్‌ఏ: తానా విశ్వ గురుకులం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ఉత్సవం ఘనంగా జరిగింది. రామాయణం అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన తానా సంస్థ చైర్మన్ కొడాలి నాగేంద్ర శ్రీనివాస్, అధ్యక్షుడు కొడాలి నరేన్ విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. రామాయణ విద్యను బోధిస్తున్న గురువుల సేవలను అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఠాగూర్ మల్లినేని కూడా ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. విశ్వ గురుకులం నిర్వాహకుడు రామ్ మారం విద్యార్థుల ప్రతిభను, ఉపాధ్యాయుల అంకితభావాన్ని, తల్లిదండ్రుల సహకారాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. రామాయణం పుస్తక రచనకు సహకారం అందించిన మామిళ్ల లోకనాథం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలువైన సూచనలు అందిస్తూ ఉపాధ్యాయుల కృషిని, విద్యార్థుల పురోగతిని, నిర్వాహకుల సేవలను అభినందించారు. పాఠశాల కార్యదర్శి శ్వేత వెలగలేటి, పద్మిని, సిద్ధార్థ్ పుట్రేవు విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి వారి ప్రతిభను ప్రశంసిస్తూ మరింతగా ప్రోత్సహించారు. విశ్వ గురుకులంలో రామాయణ తరగతులను వంశీ శ్రీవాత్సవ భద్రి రాజు, రేవతి పుట్రేవు, సుస్మిత మక్కపాటి, శ్రీరేఖ పంచవటి, భాగ్యలక్ష్మి గుమ్మడి, వంశీ బొల్ల, అనూష నిమ్మగడ్డ, సుష్మ కొల్లూరి బోధిస్తున్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు అందించడానికి తానా విశ్వ గురుకులం విశేష కృషి చేస్తోంది. రామాయణంలోని ఆదర్శాలను విద్యార్థుల జీవితాల్లో భాగం చేస్తూ సంస్కృతి పరిరక్షణకు సేవలు అందిస్తోంది. అమెరికాలో నివసిస్తున్నప్పటికీ తమ పిల్లలకు వాల్మీకి రామాయణాన్ని సంపూర్ణంగా నేర్పిస్తున్న విశ్వ గురుకులం సేవలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గురువులకు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



'తాకా' ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు

టొరంటో: తెలుగు అలయన్స్ ఆఫ్ కెనడా (తాకా) ఆధ్వర్యంలో దీపావళిని ఘనంగా నిర్వహించారు. మిస్సిసాగాలోని మైఖేల్ పవర్ సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంగీతం, నృత్యాలతో కూడిన ఈ వేడుకలు ఉత్సాహాన్ని నింపాయి. టొరంటో ప్రాంతంలోని తెలుగు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. వినోదభరితమైన ప్రత్యేక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. తాకా అధ్యక్షుడు ప్రసన్న తిరుచిరాపల్లి అతిథులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ, వాటిని భావితరాలకు అందించడం తాకా ప్రధాన లక్ష్యాల్లో ఒకటని వెల్లడించారు. ఉపాధ్యక్షురాలు వాణి జయంతి, ప్రధాన కార్యదర్శి మల్లిక్ చారి, కోశాధికారి ప్రదీప్ రెడ్డి, డైరెక్టర్లు అశ్విత, ప్రశాంతి, యశ్వంత్, కళ్యాణ్ సమన్వయపరిచారు. తాకా వ్యవస్థాపక అధ్యక్షుడు చారి సామంతపూడి, ట్రస్టీ చైర్ కల్పన మోటూరి, ట్రస్టీలు అనిత సజ్జ, ప్రవీణ్ పెనుబాక, పవన్‌కుమార్ బసాని, ఆదిత్యవర్మ, మాజీ అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుడు రమేష్ మునుకుంట్ల, వ్యవస్థాపక సభ్యుడు అరుణ్‌కుమార్ లయం, ప్రత్యేక కార్యక్రమాల కమిటీ సభ్యురాలు శ్రుతి ఏలూరి సహకరించారు. ప్రవీణ్ చీమట, డాక్టర్ గౌతమ్ కొల్లూరి సహకారాన్ని గుర్తించి సత్కరించారు. తాకా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

పరస్పర సహకారంతోనే దేశాల అభివృద్ధి

- ఇండియా-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ



ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్–ఆసియాన్ దేశాల కూటమి ఉమ్మడి భవిష్యత్తును పోటీ కాకుండా పరస్పర సహకారం నిర్దేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా–ఆసియాన్ సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఈ భాగస్వామ్యంలో ఆసియాన్ ఐక్యత, దాని కీలక భూమికకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోంది. నేడు ప్రపంచానికి అత్యంత అవసరమైనది శాంతి, స్థిరత్వం, ఒడిదుడుకులు లేని భవిష్యత్తు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సదస్సు ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్, టుగెదర్' కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని మోదీ పేర్కొన్నారు.

ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి చిహ్నంగా మార్చే శక్తి, సంకల్పం భారత్, ఆసియాన్ రెండింటికీ ఉన్నాయని ప్రధాని అన్నారు. భారతదేశ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానితో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045', 'వికసిత భారత్ 2047' లక్ష్యాలు మన ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు, సురక్షితమైన, సమ్మిళిత, సంపన్నమైన ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

1967లో ఏర్పాటైన ఆసియాన్ కూటమి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఇందులో బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్–లెస్టే, వియత్నాం సహా మొత్తం 11 సభ్య దేశాలు ఉన్నాయి. భారత్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా, తదితర దేశాలు ఈ కూటమికి డైలాగ్ పార్టనర్స్‌గా వ్యవహరిస్తున్నాయి.



ఫిలిప్పీన్స్‌లో చారిత్రాత్మక గురుద్వారా..

పునరుద్ధరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన

ఫిలిప్పీన్స్‌లోని అత్యంత పురాతన గురుద్వారా.. ఖల్సా దివాన్ పునరుద్ధరణ పనులకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఉన్న ఈ చారిత్రక గురుద్వారా శతాబ్దానికి పైగా సిక్కు సమాజానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా కొనసాగుతోంది. మూడు రోజుల ఫిలిప్పీన్స్ పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఖల్సా దివాన్‌ను మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా పునరుద్ధరణ కార్యక్రమానికి సంబంధించిన శంకుస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు సెనేటర్ ఫ్రాన్సిస్ జోసెఫ్ ఎస్కుడెరో, మనీలా నగర మేయర్ ఫ్రాన్సిస్కో ఇస్కో మోరెనో పాల్గొన్నారు.

అనంతరం ప్రధానమంత్రి ఖల్సా దివాన్‌లో 'కార్ సేవ' (స్వచ్ఛంద సేవ) నిర్వహించారు. ఈ సందర్భంగా పురాతన గురుద్వారా ఖల్సా దివాన్‌ను సందర్శించడం, ఇక్కడ ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

కాగా, గురుద్వారా ఖల్సా దివాన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. దీనిని 1901లో తొలిసారిగా స్థాపించారు. 1903లో వ్యవస్థీకృత సంస్థగా రూపుదిద్దుకోగా.. 1924లో ఖల్సా దివాన్ పేరుతో అధికారికంగా నమోదు చేయబడింది. ఫిలిప్పీన్స్‌లో ఏర్పాటైన తొలి గురుద్వారా ఇదే కావడంతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ముఖ్యంగా మనీలాలో నివసించే సిక్కులు, పంజాబీ కుటుంబాలకు తరతరాలుగా ఈ గురుద్వారా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. ఈ గురుద్వారా కేవలం ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించే స్థలం మాత్రమే కాదు. సిక్కు సంప్రదాయాలు, గురువుల బోధనలు, సేవాభావాన్ని తర్వాతి తరాలకు అందించే కేంద్రంగానూ పనిచేస్తోంది.

కోర్టుతో ఆడుకుంటున్నారా?

- కేజ్రీవాల్‌పై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం



ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పార్టీ నేతలపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఇప్పటివరకు సమాధానాలు దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై గడువు పొడిగించేది లేదని స్పష్టం చేస్తూ.. చివరిసారిగా మూడు వారాల సమయం ఇచ్చింది. ఈలోగా సమాధానాలు సమర్పించకపోతే తమ వాదనలు వినిపించే హక్కును కోల్పోతారని హెచ్చరించింది.

ఢిల్లీ మద్యం విధానం కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, తదితర నిందితులను ట్రయల్ కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్న సమయంలో.. కేజ్రీవాల్, సిసోడియా, తదితరులు ఆమె విచారణ నుంచి తప్పుకోవాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే న్యాయమూర్తి ఆ అభ్యర్థనలను తిరస్కరించారు. దీంతో కేజ్రీవాల్, సిసోడియా, తదితరులు ఆమె ఎదుట వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా హాజరుకాబోమని లేఖలు రాశారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు, పోస్టులు, వీడియోల నేపథ్యంలో కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభమయ్యాయి.

ఈ కోర్టు ధిక్కరణ వ్యవహారంలో అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజయ్ సింగ్, దుర్గేశ్ పాఠక్, వినయ్ మిశ్రా, దేవేష్ విశ్వకర్మ, తదితరులు ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ అరుణ్ భరద్వాజ్‌లతో కూడిన ధర్మాసనం ఆప్ నేతల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. కేసుకు సంబంధించిన పత్రాలు అందలేదని నేతల తరఫు న్యాయవాదులు చెప్పారు. అయితే రిజిస్ట్రీ నుంచి అందిన నివేదిక ప్రకారం అవసరమైన పత్రాల పంపిణీ పూర్తయిందని ధర్మాసనం పేర్కొంది. ఈ సందర్భంగా న్యాయస్థానం.. 'మమ్మల్ని ఆటపట్టిస్తున్నారా? ఇకపై మీకు సమయం ఇవ్వబోం. ఇప్పుడే సమాధానాలు దాఖలు చేయండి. లేకపోతే ఆ హక్కును మూసివేస్తాం' అంటూ తీవ్రంగా హెచ్చరించింది.

లోయలో పడ్డ బస్సు: 8 మంది మృతి

- ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన

ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ గఢ్వాల్ జిల్లా గూలర్ బజార్ సమీపంలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ బస్సు అదుపుతప్పి లోయలో పడ్డ దుర్ఘటనలో 8 మంది మృతిచెందగా, 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా అదుపుతప్పిన బస్సు వంతెన పైనుంచి సుమారు 100 మీటర్ల లోతులో ఉన్న లోయలో పడిపోయింది. దీంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. ప్రమాద సమయంలో వాహనంలో సుమారు 30 నుంచి 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.



సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర విపత్తు స్పందన దళం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి, లోయలో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌ల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అదనపు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలనూ అక్కడికి రప్పించారు. మరోవైపు, బస్సు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇదిలా ఉండగా.. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో సోమవారం రాత్రి మరో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాన్సువాడ–మోహన్‌ఖల్ రహదారిపై ఓ బొలెరో వాహనం లోయలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు.

వరుసగా వాహనాలు లోయల్లో పడి ప్రాణాలు కోల్పోతుండటంతో రోడ్ల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఢిల్లీలో కూలిన భవనం: ఇద్దరు మృతి

దేశరాజధాని ఢిల్లీలో ఓ భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం తూర్పు ఢిల్లీలోని షాదరా జిల్లాలోని వివేక్ విహార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జ్వాలా నగర్ ప్రాంతంలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. 50ఏళ్ల నాటి రెండు అంతస్తుల పురాతనభవనం ఒక్కసారిగా కుప్పకూలింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక, పోలీసు సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

శిథిలాల కింద చిక్కుకున్న సుమారు ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడారు. అయితే ఈ ప్రమాదంలో చిన్నారితోపాటు ఓ యువకుడు మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. శిథిలాల కింద మరికొంత మంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

మోదీ చాలా టఫ్.. గొప్ప నాయకుడు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ సమర్థుడైన నాయకుడని, అవసరమైన సమయాల్లో చాలా కఠినంగా వ్యవహరిస్తారని కితాబునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆయన్ను ఎంతగానో గౌరవిస్తారని చెప్పారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరుగుతున్న క్వాడ్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్ (క్వాడ్) సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, జపాన్ ప్రధాని సనాయే తకాయిచిలు పాల్గొన్నారు. నలుగురు నేతలు గ్రూప్ ఫొటో దిగిన అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. ఈ కూటమి దేశాలు, ప్రజలతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. ముగ్గురు దేశాధినేతలతో సుదీర్ఘకాలంగా నాకు అనుబంధం ఉంది. వాళ్లు మంచి స్నేహితులు. ఇక మోదీ విషయానికొస్తే.. ఆయన గొప్ప వ్యక్తి. అవసరమైతే చాలా కఠినంగా వ్యవహరిస్తారని ట్రంప్ పేర్కొన్నారు. జపాన్ ప్రధాని సనాయే తకాయిచి మరింత కఠినమైన వ్యక్తి అని వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియా ప్రధాని వైపు చూస్తూ.. తామిద్దరం ఫర్వాలేదు అంటూ నవ్వుతూ చెప్పారు.

క్వాడ్ కూటమి ప్రపంచంలో అత్యంత విజయవంతమైన భాగస్వామ్యాల్లో ఒకటని అన్నారు. క్వాడ్ కూటమి దేశాలైన భారత్, అమెరికా, జపాన్.. రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నాయని అన్నారు. మాకు కావాల్సినవి మేము 10 నెలల్లో సమకూర్చుకోగలము. రేర్ ఎర్త్ ఖనిజాలను భారీ స్థాయిలో ఉత్పత్తి చేసుకుంటున్నాము. క్వాడ్ దేశాల మధ్య స్నేహ, సహకార సంబంధాలు మరింత బలపడ్డాయని పేర్కొన్నారు. ఈ స్నేహం కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కూటమిలోని దేశాలు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశాల జాబితాలో ఉన్నాయని అన్నారు.

ప్రస్తుతం మూడు రోజుల ఆసియా పర్యటనలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ ఆ తరువాత చైనాలో కూడా పర్యటిస్తారు. అక్కడ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం అవుతారు. ఈ పర్యటనలో ఉత్తరకొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌తో కూడా సమావేశమయ్యే అవకాశం ఉందని చెప్పారు.

విదేశీ విద్యార్థులు. జర్నలిస్ట్‌ల నివాస గడువుపై..

యూఎస్ ఫెడరల్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ



అమెరికాలో ఉన్నత చదువులు అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు, వృత్తిరీత్యా పనిచేస్తున్న విదేశీ జర్నలిస్టులకు అక్కడి ఫెడరల్ కోర్టు భారీ ఊరటనిచ్చింది. విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల నివాస గడువు పరిమితికి సంబంధించి ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన సరికొత్త నిబంధనను యూఎస్ ఫెడరల్ జడ్జి కొట్టివేశారు. ఎఫ్-1, జె-1, 1 వీసాలు ఉన్నవారికి నివాస కాలపరిమితిని భారీగా కుదిస్తూ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం 2026లో నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాస్తవానికి దీనిపై గత సెప్టెంబర్ 14నే కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ జారీ చేసింది.

సోమవారం బోస్టన్‌లోని మసాచుసెట్స్ ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ తీర్పు వెలువరించారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) రూపొందించిన ఈ నూతన విధానం ఏకపక్షంగా, అహేతుకంగా, చట్టవిరుద్ధంగా ఉందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఏమిటీ వివాదం?

ఇప్పటివరకు ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' నిబంధన ప్రకారం.. విదేశీ విద్యార్థులు (ఎఫ్-1, జే-1 వీసాదారులు) తమ కోర్సు పూర్తయ్యేంతవరకు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలుకుతూ విద్యార్థుల వీసా గరిష్ఠంగా నాలుగేళ్లకు పరిమితం చేసింది. ఆ తర్వాత పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన పెట్టింది. అలాగే విదేశీ జర్నలిస్టుల ఐ-వీసా గడువును ఐదేళ్ల నుంచి కేవలం 240 రోజులకు (సుమారు 8 నెలలు), చైనా జర్నలిస్టులకు 90 రోజులకు కుదించింది. దీనిని సవాలు చేస్తూ విశ్వవిద్యాలయాల సంఘాలు, అధ్యాపకులు, కార్మిక, జర్నలిస్టు సంఘాల కూటమి ఆగస్టులో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సెప్టెంబరులో ఈ నిబంధనల అమలుపై తాత్కాలిక స్టే విధించిన న్యాయమూర్తి, తాజాగా వాటిని పూర్తిగా కొట్టివేశారు.

కాంగ్రెస్ ఉద్దేశానికి విరుద్ధం..

ఈ సందర్భంగా న్యాయమూర్తి డెన్నిస్ సేలర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ విద్యార్థులకు అమెరికాలో విద్యావకాశాలు కల్పించాలని అమెరికా కాంగ్రెస్ భావిస్తుంటే, డీహెచ్ఎస్ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వారిని నిరుత్సాహపరుస్తోందని సేలర్ స్పష్టం చేశారు. ఈ నిబంధనల వల్ల పీహెచ్‌డీ వంటి సుదీర్ఘ పరిశోధన కోర్సులు చేయడం, జాయింట్ డిగ్రీలు పొందడం, కోర్సు మధ్యలో సబ్జెక్టులు మార్చుకోవడం విద్యార్థులకు అసాధ్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోసాలను అరికట్టేందుకు 'సెవిస్' వంటి ప్రత్యామ్నాయ వ్యవస్థలను బలోపేతం చేయకుండా, నేరుగా వీసా గడువును కుదించడం సరికాదన్నారు.

అమెరికా భీకర దాడుల్లోనూ.. చెక్కుచెదరని ఇరాన్ భూగర్భ క్షిపణి స్థావరాలు





అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేసినప్పటికీ ఇరాన్ నిర్మించుకున్న భూగర్భ క్షిపణి స్థావరాలు చెక్కుచెదరకుండానే ఉన్నాయట. భారీ గ్రానైట్ పర్వతాల లోపల వందల మీటర్ల లోతులో నిర్మించిన ఈ రహస్య స్థావరాల్లో వేలాది క్షిపణులు, డ్రోన్లు, ప్రయోగ వ్యవస్థలు సురక్షితంగానే ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. శత్రువుల వైమానిక దాడుల నుంచి ఆయుధాలను రక్షించుకునేందుకు ఇరాన్ ఏళ్ల తరబడి ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇరాన్‌లోని యాజ్డ్ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ భూగర్భ క్షిపణి స్థావరం సుమారు 500 మీటర్ల లోతులో పర్వతం లోపల నిర్మించినట్లు డైలీ మెయిల్ కథనం పేర్కొంది. అత్యంత దృఢమైన షిర్కూహ్ గ్రానైట్ శిలలను తొలిచి నిర్మించిన ఈ స్థావరాన్ని అత్యంత శక్తిమంతమైన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులతో కూడా ధ్వంసం చేయడం కష్టమని పేర్కొంది. ఈ స్థావరాలు సాధారణ ఆయుధ గిడ్డంగుల్లా కాకుండా భూగర్భ నగరాలను తలపించేలా నిర్మించినట్లు నివేదిక పేర్కొంది. లోపల పొడవైన సొరంగాలు, క్షిపణుల నిల్వ కేంద్రాలు, వాటిని తరలించే రవాణా వ్యవస్థలు ఉన్నట్లు వివరించింది.

అమెరికా, ఇజ్రాయెల్ దళాలు యాజ్డ్ ప్రాంతంలోని భూగర్భ క్షిపణి స్థావరంపై కనీసం ఆరుసార్లు దాడులు చేసినట్లు ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ (ఐఎస్‌డబ్ల్యూ) పేర్కొంది. ఇన్నిసార్లు దాడి చేసినప్పటికీ ప్రవేశ మార్గాలు మాత్రమే దెబ్బతిన్నాయి. వాటిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ ప్రయత్నిస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాలు, ఇతర నిఘా సమాచారం ద్వారా బయటపడింది. కొన్ని ప్రాంతాల్లో దాడుల అనంతరం నిర్మాణ పరికరాలు తిరిగి కనిపించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

అమెరికాపై డర్టీబాంబ్.. ఇరాన్ ప్లాన్?




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని కీలక అధికారులను లక్ష్యంగా చేసుకుని వాషింగ్టన్‌లో డర్టీ బాంబు లేదా రసాయన ఆయుధాలతో దాడి చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందనే వార్త అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ఎన్ ఓ సంచలన కథనం ప్రచురించింది. అయితే అమెరికాపై తక్షణ దాడి ముప్పు ఉందని నిర్ధారించే విశ్వసనీయ సమాచారం ప్రస్తుతం లేదని వైట్‌హౌస్ స్పష్టం చేసింది.

ఏడుగురు అమెరికా అధికారులను ఉటంకిస్తూ సీఎన్ఎన్ ఈ కథనాన్ని ప్రచురించింది. సీఎన్ఎన్ కథనం ప్రకారం.. ఇరాన్ రూపొందిస్తున్న ప్రణాళికలో వాషింగ్టన్‌లోని నిర్దిష్ట ప్రాంతాలు, కీలక అధికారుల ప్రస్తావన ఉన్నట్లు ఇద్దరు అధికారులు తెలిపారు. ఈ సమాచారంతో గత వారం రోజులుగా అమెరికా ఉన్నతాధికారులు పలుమార్లు సమావేశమై భద్రతా చర్యలు, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై చర్చించినట్లు కథనం పేర్కొంది. ఇప్పటికే ఇరాన్‌పై అమెరికా ఆర్థిక యుద్ధానికి సారథ్యం వహిస్తున్న మంత్రి స్కాట్ బెసెంట్ నివాసాన్ని సీక్రెట్ సర్వీస్ సిబ్బంది గత వారం మిలిటరీ స్థావరానికి మార్చారు.

కాగా, ఈ కథనాన్ని ఇరాన్ ఖండించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ రసాయన ఆయుధాల వినియోగాన్ని తమ దేశం సమర్థించదని ఇరాన్ ఐక్యరాజ్యసమితి దౌత్య మిషన్ తెలిపింది. తమపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

డర్టీ బాంబు తయారీకి వాడే రేడియో యాక్టివ్ మెటీరియల్‌ను తరలించడం చాలా తేలిక. దీనికోసం శిక్షణ పొందిన ఆపరేటివ్ ను అమెరికాలోకి కొత్తగా పంపాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఆ దేశంలో ఉంటున్న ఇరానీయులను ఈ కుట్రలోకి లాగితే చాలు. ఇక బాంబు తయారీకి అవసరమైన సామగ్రి కూడా అమెరికాలోకి చేరి ఉండొచ్చని కొన్ని చాటింగ్‌ల ద్వారా ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనాకు వచ్చాయి.

ఎప్‌స్టీన్‌ది ఆత్మహత్య కాదు..హత్య!



అమెరికాలో ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి జెఫ్రీ ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన జైల్లో ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారులు అప్పట్లో వెల్లడించారు. అయితే.. అతడిని హత్య చేశారని అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ నిపుణుడు ప్రొఫెసర్ మైఖేల్ ఫ్రీమాన్ తాజాగా సంచలన ప్రకటన చేశారు. అతడి మరణంపై వివరాలు సేకరించానని.. అందులో గొంతు నులమడం, మెడకు తాడు బిగించడం వల్ల మరణించినట్లు తేలిందని స్థానిక మీడియా వర్గాలకు వెల్లడించారు. అతడి ఎడమ భుజంలో తీవ్ర రక్తస్రావం, ముఖంపై పలు గాయాలు ఉన్నట్లు తెలిపారు. ప్లాన్ ప్రకారం చేసిన హత్య (వీబతీఎవతీ)ను కొందరు ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టాలని అధికారులను కోరారు.

ఎప్‌స్టీన్ మరణించి ఏడేళ్లయినా.. ఆత్మహత్యకు సంబంధించి పలు ప్రశ్నలు వినిపిస్తూనే ఉన్నాయి. అతడు ప్రాణాలు కోల్పోవడానికి ముందు సీసీటీవీ ఫుటేజీలో మూడు నిమిషాల పాటు అంతరాయం ఏర్పడడం, సెల్ బయట ఉన్న రెండు కెమెరాలు పనిచేయకపోవడం వంటి కారణాలపై పలువురు అనుమానాలు లేవనెత్తారు. ఫోరెన్సిక్ నిపుణుడి తాజా ప్రకటనతో ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.

ఎప్ స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మన్‌హాట్టన్ జైల్లో మృతి చెందాడు. జైలు గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అప్పట్లో అధికారులు ధ్రువీకరించారు.

ఇక సెలవ్.. ఐపీఎల్‌కు ధోనీ వీడ్కోలు!



- ఆటగాడిగా సుదీర్ఘప్రయాణానికి ముగింపు
- సీఎస్‌కే జట్టు మెంటార్‌గా కొత్త బాధ్యతలు

మహేంద్రసింగ్ ధోనీ, చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు మింగుడు పడని వార్త ఇది. టీమిండియా దిగ్గజ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఆటగాడిగా తన ప్రయాణాన్ని ముగిస్తూ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇకపై సీఎస్‌కే జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సీఎస్‌కే యాజమాన్యం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. గాయాల కారణంగా గత సీజన్లో ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇప్పటికే ఈ దిగ్గజ క్రికెటర్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. దాదాపు రెండు దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన మహీ.. ఇకపై మైదానంలో ఆటగాడిగా కనిపించబోడు. ఇప్పటికే జహీర్ ఖాన్‌ను హెడ్ కోచ్‌గా నియమించిన ఫ్రాంచైజీ.. ఇప్పుడు ధోనీకి కీలక బాధ్యతలు అప్పగించడం విశేషం.

ఐదు ఐపీఎల్ టైటిళ్లు.. సీఎస్కేకు స్వర్ణయుగం

ధోనీ కెప్టెన్సీలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2010, 2011, 2018, 2021, 2023లో టైటిళ్లు సాధించింది. దీంతో ఐదు ట్రోఫీలతో ముంబై ఇండియన్స్‌తో కలిసి అత్యధిక టైటిళ్లు సాధించిన జట్టుగా సీఎస్కే నిలిచింది. అంతేకాకుండా 2010, 2014లో రెండుసార్లు ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను కూడా గెలుచుకుంది. ధోనీ నాయకత్వంలో చెన్నై ఏకంగా పదిసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరింది. 2016, 2017 సీజన్లలో సీఎస్కేపై నిషేధం విధించిన సమయంలో ధోనీ రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ తరఫున ఆడాడు. 2018లో చెన్నై తిరిగి ఐపీఎల్‌లోకి అడుగుపెట్టగానే ధోనీ నాయకత్వంలో ఆ జట్టు టైటిల్ సాధించింది.

ఐపీఎల్‌లో ధోనీ గణాంకాలు

ధోనీ తన ఐపీఎల్ కెరీర్‌లో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించాడు. 38.30 సగటు, 137.45 స్ట్రైక్‌రేట్‌తో రాణించాడు. ఇందులో 24 అర్ధసెంచరీలు ఉన్నాయి. 264 సిక్సర్లు, 375 ఫోర్లు బాదాడు. సీఎస్కే తరఫున 272 మ్యాచ్‌ల్లో 5,314 పరుగులు చేశాడు. ఇక ఐపీఎల్ లో సీఎస్కే జట్టుకు సేవలందించాడు. ఐపీఎల్లో కెప్టెన్‌గా రికార్డు స్థాయిలో 226 మ్యాచ్లకు నాయకత్వం వహించి, 133 మ్యాచ్లను గెలిచిన ధోనీ, మిగతా కెప్టెన్లందరి కంటే ఉన్నత స్థానంలో ఉన్నాడు. కనీసం 10 మ్యాచ్లకు నాయకత్వం వహించిన కెప్టెన్లందరిలో, ధోనీ 58.84 విజయ శాతం ఇప్పటికీ లీగ్ లోనే అత్యుత్తమమైనది. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక టీ20 మ్యాచ్లకు నాయకత్వం వహించిన ప్రపంచ రికార్డు కూడా ధోనీ పేరిట ఉంది.

ధోనీతో మా అనుబంధం ప్రత్యేకం


- 7వ నెంబర్ జెర్సీకి కూడా వీడ్కోలు
- సీఎస్‌కే యజమాని ఎన్.శ్రీనివాసన్



మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్కు రిటైర్మెంట్ ప్రకటించడంపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) యజమాని ఎన్.శ్రీనివాసన్ స్పందించారు. ధోనీతో తమ అనుబంధం ఎప్పటికీ విడదీయలేనిదని శ్రీనివాసన్ అన్నారు. ధోనీ లేకుండా సీఎస్కే లేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా విజయాలు, పరాజయాల్లో మేమిద్దరం కలిసి ప్రయాణించాం. మా మధ్య బంధం ఇంత బలంగా ఉండటానికి కారణం ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే. ఒకరి అభిప్రాయాలను మరొకరం ఎప్పుడూ గౌరవించుకునేవాళ్లం. 2008లో జరిగిన తొలి ఐపీఎల్ వేలంలో ధోనీని జట్టులోకి తీసుకోవాలన్న నా నిర్ణయం జీవితంలోనే అత్యుత్తమమైనది. సీఎస్కేకు అతడు సాధించిన విజయాలే కాదు.. గొప్ప వ్యక్తిత్వం కూడా నన్నెంతో ఆకట్టుకుంది. మా అస్తిత్వంలో ధోనీ ఎప్పటికీ భాగమే. సీఎస్కే ఎల్లప్పుడూ అతనికి సొంత ఇల్లే అని శ్రీనివాసన్ పేర్కొన్నారు.

అయితే ధోనీ ఆకస్మిక రిటైర్మెంట్‌తో కాస్త షాక్‌కు గురైన సీఎస్కే యాజమాన్యం.. అతడు ధరించే నెంబర్ 7 జెర్సీకి కూడా అతడి గుర్తుగా వీడ్కోలు పలకాలని నిర్ణయించింది. ఇక ఐపీఎల్ లో తమ జట్టు కొనసాగినంత కాలం నెంబర్-7 జెర్సీని ఎవరికి ఇవ్వబోమని, ధోని సేవలకు గుర్తుగా ఆ ఐకానిక్ జెర్సీని షోకేస్‌లో పెట్టుకుంటామని సీఎస్కే తెలిపింది. 2020లో అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన ధోనీ సేవలకు గౌరవంగా అతడు ధరించిన నెంబర్-7 జెర్సీకి కూడా రిటైర్మెంట్ ఇస్తూ గతంలోనే బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు సీఎస్‌కే కూడా అదే కోవలో నిర్ణయించింది.

కోహ్లి నిర్ణయం తప్పు: కపిల్‌దేవ్



టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ కావాలని విరాట్ కోహ్లి తీసుకున్న నిర్ణయం అతడి కెరీర్లో చేసిన అతిపెద్ద తప్పు అని భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ వ్యాఖ్యానించాడు. ఎంతో ఫిట్‌గా ఉన్న విరాట్‌కు సుదీర్ఘ ఫార్మాట్లో ఇంకా రాణించగల సత్తా ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయం పట్ల భవిష్యత్తులో కోహ్లి పశ్చాత్తాపం వ్యక్తం చేస్తాడని పేర్కొన్నాడు. 2025 మేలో కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై కపిల్ మాట్లాడుతూ కోహ్లి టెస్టుల నుంచి రిటైర్ అయి అతిపెద్ద తప్పు చేశాడని అనుకుంటున్నానన్నాడు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు మరో పదేళ్ల తర్వాత అతడు కచ్చితంగా పశ్చాత్తాపపడతాడు. ఆ నిర్ణయం తీసుకోకుండా ఉండాల్సింది. అతడికి ఉన్నంత అద్భుతమైన ఫిట్నెస్ మరే ఆటగాడికి లేదు. ఈ విషయంలో 25 ఏళ్ల క్రికెటర్‌కు సైతం కోహ్లి సవాలు విసరగలడు. ఎవరి మీదో కోపంతో రిటైర్ అవ్వడం సరికాదు. ఇలాంటి వాటిల్లో మొహిందర్ అమర్నాథ్ లాగా ఉండాలి. అతడిని ఎన్నోసార్లు జట్టు నుంచి తొలగించారు. కానీ, తిరిగి జట్టులో చోటు సంపాదించుకుని తన విషయంలో ఇతరుల అంచనాలు తప్పు అని నిరూపించాడని కపిల్ దేవ్ గుర్తుచేసుకున్నాడు. టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన కోహ్లి ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు.

నలుగురు పేసర్లతో ఆడతాం: గిల్

ఈ నెల 19 నుంచి న్యూజిలాండ్‌తో మొదలుకానున్న తొలి టెస్టులో భారత్ నలుగురు పేసర్లతో బరిలోకి దిగుతుందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. కివీస్తో వన్డే సిరీస్‌లో భారత యువ ఫాస్ట్ బౌలర్లు అదరగొట్టడం సంతోషకరమని, దీంతో తుది జట్టు కూర్పు విషయంలో తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తోందన్నాడు. మాకు ఏడుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు ఉన్నారు. ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో బ్యాట్‌తో సహకారం అందించేందుకు అన్షుల్ కాంబోజ్, ఆకాశ్ దీప్ ఉన్నారు. నితీశ్ రెడ్డి బ్యాటింగ్ చేయగలడు. కాబట్టి మేం బ్యాటింగ్ ఆప్షన్లపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. మాకు తుది జట్టులో నలుగురు పేసర్లు అవసరం. ఎవరెవరు ఆడతారో ఇంకా డిసైడ్ చేయలేదు. రిషభ్ పంత్ ఫిట్నెస్ విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదు. అతడు 50కి పైగా టెస్టులు ఆడాడు. ప్రపంచవ్యాప్తంగా పరుగులు సాధించాడు. వన్డేల కంటే ఈ సిరీస్ పెద్ద సవాలు కానుంది. న్యూజిలాండ్‌కు ఇక్కడ మంచి రికార్డు ఉందని గిల్ వివరించాడు.

పేస్ విభాగానికి జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహిస్తాడు. మిగిలిన మూడు స్థానాల కోసం సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ కృష్ణ పోటీపడుతున్నారు. వన్డే సిరీస్లో తొమ్మిది వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గా నిలిచిన



గూర్నూర్ బ్రార్ తోపాటు నితీశ్ రెడ్డి కూడా రేసులో ఉన్నాడు. న్యూజిలాండ్ గడ్డపై 25 టెస్టులు ఆడిన టీమిండియా ఐదింట మాత్రమే గెలిచింది. 10 టెస్టుల్లో ఓడి 10 మ్యాచ్లను డ్రా చేసుకుంది.

మను భాకర్‌కు అరుదైన గౌరవం

ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ కమిటీకి ఎన్నిక



భారత స్టార్ షూటర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత మను భాకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్స్ కమిటీకికి ఆమె ఎన్నికైంది. 2026-2030 కాలానికి పిస్టల్ కేటగిరీలో ఆమె ఎన్నికైనట్లు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ పదవికి పోటీ చేసిన పది మంది అభ్యర్థుల్లో ఇద్దరిని ఎన్నిక చేయగా.. అందులో మను చోటు దక్కించుకుంది. దోహాలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ (రైఫిల్/పిస్టల్/షాట్‌గన్) పోటీల సందర్భంగా నవంబర్ 3 నుంచి నవంబర్ 13 వరకు ఎన్నికలు జరిగాయి.

నామినేషన్ సందర్భంగా మను భాకర్ తన లక్ష్యాలను వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా షూటర్లకు మరింత మెరుగైన, సహాయకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపింది. అథ్లెట్ల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ షూటింగ్‌ను మరింత ప్రగతిశీలంగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

అఫ్గాన్ ఓటమి జింబాబ్వేదే టెస్ట్ సిరీస్

షార్జా వేదికగా అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టులో జింబాబ్వే 57 పరుగుల తేడాతో సంచలన విజయాన్ని అందుకుంది. ఆద్యంతం నువ్వా నేనా అన్నట్లుగా సాగిన మ్యాచ్‌లో జింబాబ్వే పైచేయి సాధించింది. అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ నసీర్ ఖాన్ మరుఫ్ ఖిల్ (242 బంతుల్లో 101 నాటౌట్) వీరోచిత సెంచరీ సాధించినప్పటికీ, జట్టును ఓటమి నుంచి తప్పించలేకపోయాడు.

418 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ 360 పరుగులకు ఆలౌటైంది. మిగిలిన బ్యాటర్లలో అఫ్సర్ జజయ్ (87), అర్ధసెంచరీ సాధించాడు. మిగతా బ్యాటర్లలో హష్మతుల్లా షాహిది (35), రహ్మత్ షా (30), వికెట్ కీపర్ ఇక్రమ్ అలిఖిల్ (26), ఆఖర్లో మొహమ్మద్ సలీమ్ (22)తో కలిసి నసీర్ పోరాడినప్పటికీ ఫలితం లేకపోయింది.

జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవన్స్, బ్లెసింగ్ ముజరబానీ చెరో మూడు వికెట్లు పడగొట్టగా, విన్సెంట్ మసికేస, గ్రేమీ క్రీమర్ చెరో రెండు వికెట్లు తీశారు. ఇక ఆఫ్గన్ ఆల్‌రౌండర్ నసీర్ ఖాన్‌కు టెస్టుల్లో ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. రెండు మ్యాచ్ల టెస్టు సిరీసు 1-0తో జింబాబ్వే సొంతం చేసుకుంది.

చైతన్య రథం
సినిమా
బుధవారం 18 నవంబరు 2026

‘అవెంజర్స్: డూమ్స్‌డే’..
భారత్‌లోనూ అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం



మార్వెల్ స్టూడియోస్ ప్రతిష్టాత్మక చిత్రం ‘అవెంజర్స్: డూమ్స్‌డే’. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, భారత్‌లో కూడా అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి. సోషల్ మీడియాలో అభిమానులు చేపట్టిన ప్రచారానికి స్పందించిన మార్వెల్ సంస్థ టికెట్ బుకింగ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన లభిస్తోంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి వంటి ప్రధాన నగరాల్లో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. రోజంతా వివిధ సమయాల్లో షోలు అందుబాటులో ఉండటంతో అభిమానులు మొదటి రోజు మొదటి షో టికెట్ల కోసం పోటీపడుతున్నారు.

ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా కూడా భారీ క్రేజ్ నెలకొంది. అడ్వాన్స్ టికెట్ అమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా 150 మిలియన్ డాలర్లను దాటినట్లు సమాచారం. ఇక ఈ సినిమా విడుదలైన తొలి ట్రైలర్ కేవలం 24 గంటల్లోనే 503 మిలియన్ల వ్యూస్ సాధించి, ప్రపంచ సినిమా చరిత్రలో అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్లలో రెండో స్థానంలో నిలిచింది. భారతీయ ప్రేక్షకులకు మరో ప్రత్యేకమైన కానుకగా, అమెరికా విడుదల కంటే ఒక రోజు ముందుగానే ఈ సినిమా మన దేశంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రం విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో మార్వెల్ స్టూడియోస్ ప్రెజెంట్స్ ఇన్ఫినిటీ విజన్‌తో పాటు ఇతర ప్రీమియం ఫార్మాట్లలో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది.

రొమాంటిక్ టచ్‌తో ‘సీతాకోకమ్మ’ పాట..



ప్రముఖ దర్శకుడు, నిర్మాత రమేష్ వర్మ నిర్మాణ సంస్థ ఆర్వీ ఫిలిమ్స్ నుంచి తొలి ప్రయత్నమైన ‘కొక్కొరొకో’, ఐదు విభిన్న పాత్రలతో కూడిన ఒక ఆంథాలజీ చిత్రంగా రాబోతోంది. ఈ సినిమాతో శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే ‘కొక్కొరొకో’ గ్లింప్స్, పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్న క్రమంలో మంగళవారం ఫస్ట్ సింగిల్‌గా ‘సీతాకోకమ్మ’ పాటను మేకర్స్ విడుదల చేశారు.

ప్రధాన పాత్రధారులు శీను, పార్వతిల మధ్య ఉన్న సున్నితమైన ప్రేమను ఒక హృద్యమైన బాణీతో ఈ పాట అందంగా పరిచయం చేస్తుంది. ఎస్. కృష్ణ ప్రసాద్ స్వరపరిచిన ఈ గీతానికి శ్వేతా మోహన్ తన మధురమైన గాత్రంతో ప్రతి స్వరానికి సున్నితత్వాన్ని జోడించారు. ఆస్కార్ పురస్కారం అందుకున్న గీత రచయిత చంద్రబోస్ ప్రేమలోని అమాయకత్వాన్ని ఆవిష్కరించే హృద్యమైన సాహిత్యం ద్వారా ఈ పాటకు అందాన్ని, గొప్ప అర్థాన్ని జోడించారు. ఆహ్లాదకరమైన సంగీతం, సున్నితమైన రొమాంటిక్ టచ్‌తో ‘సీతాకోకమ్మ’ పాట శ్రోతల హృదయాల్లో నిలిచిపోయేలా ఉంది. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ సోదరుడైన జి.వి.సాగర్ ఈ చిత్రానికి సంభాషణలు అందిస్తున్నారు. ప్రముఖ రచయిత, స్వర్గీయ సత్యమూర్తి తనయుడైన సాగర్ కు ‘రాక్షసుడు’ తర్వాత మాటల రచయితగా ఇది రెండో సినిమా. లండన్‌కు చెందిన సంగీత ప్రియుడు సంకీర్తన్ సంగీతం సమకూర్చారు. రేఖా వర్మ, కురపాటి శిరీష ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రమేష్ వర్మ కథ, స్క్రీన్ ప్లే అందించారు.

ఒకే కథ.. రెండు చిత్రాలు.. ఒకేరోజు విడుదల



ఈ నెల 20వ తేదీన అనువాద చిత్రాలతో కలిపి దాదాపు పది సినిమాలు విడుదల కాబోతున్నప్పటికీ అందరి దృష్టి మాత్రం రెండు సినిమాలపైనే ఉంది. ఈ రెండు సినిమాల కథలు దాదాపుగా ఒక్కటే కావడమే అందుకు కారణం. అవే ‘ఆకాశంలో ఒక తార’, ‘డియర్ ఆస్ట్రోనాట్’ సినిమాలు.

ఒక గ్రామీణ యువతి.. అంతరిక్షంలోకి వెళ్లాలనే పెద్ద కల. ఆ కలను నిజం చేయడానికి ఆమెకు అండగా నిలిచే ఓ వ్యక్తి. ఈ కథాంశంతోనే ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి.

దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతిహాసన్, రుహాని శర్మ కీలక పాత్రలు పోషిస్తున్న ‘ఆకాశంలో ఒక తార’ సినిమాను పవన్ సాదినేని దర్శకత్వంలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా బ్యానర్స్ నిలిచాయి. ఓ సాధారణ దిగువ తరగతి యువతి ఆస్ట్రోనాట్ కావడం కోసం ఎలాంటి కృషి చేసింది? ఆ సమయంలో బొగ్గుగనుల్లో పనిచేసే ఒక యువకుడు ఆమెకు బాసటగా ఎలా నిలిచాడు? ఆమె తన లక్ష్యాన్ని ఛేదించడానికి పడిన శ్రమ ఏమిటీ అనేది ‘ఆకాశంలో ఒక తార’ సినిమా కథగా తెలుస్తోంది. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. దీనిని తెలుగుతో పాటు తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల చేయబోతున్నారు.

దాదాపుగా ఇలాంటి కథతోనే తెరకెక్కిన మరో సినిమా ‘డియర్ ఆస్ట్రోనాట్’. చిన్నప్పటి నుంచి ఆస్ట్రోనాట్ కావాలని కలలు కన్న ఓ అమ్మాయి పెళ్ళి తర్వాత తన కల చెదిరిపోతుందని భయపడుతుంది. అయితే భర్త ప్రోత్సాహంతో ఆమె తన గమ్యాన్ని చేరుకుంటుంది. ఈ క్రమంలో ఆమె ఎలాంటి అడ్డంకులను ఎదుర్కొందన్నదే ‘డియర్ ఆస్ట్రోనాట్’ కథ. ఈ సినిమాలో ప్రధాన పాత్రలను సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, దేవిప్రసాద్, చైత్ర తదితరులు పోషించారు. ఈ సినిమాను కార్తీక్ భాగ్యరాజ తెరకెక్కించారు.

విశేషం ఏమిటంటే... ఈ రెండు సినిమాల్లోనూ ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు గౌతమ్ వాసుదేవ మీనన్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. ఏదేమైనా ‘ఆకాశంలో ఒక తార’, ‘డియర్ ఆస్ట్రోనాట్’ రెండూ కూడా మహిళా ప్రధాన సందేశాత్మక చిత్రాలు. వ్యోమగామి కావాలనే ఓ యువతి కలను కేంద్రంగా చేసుకుని రూపొందించిన ఈ రెండు చిత్రాలను ప్రేక్షకులు ఏ విధంగా ఆదరిస్తారో చూడాలి.

ఫీల్ గుడ్ సాంగ్ ‘మరొక్కసారి’..



శ్రీనివాస్ గవిరెడ్డి, బ్రిగిడ సాగా ప్రధాన పాత్రల్లో వైఎన్ లోహిత్ తెరకెక్కించిన చిత్రం ‘చీన్ టపాక్ డుండుం’. ఈ సినిమాను విలేజ్ టాకీస్ బ్యానర్ మీద శ్రీను నాగులపల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. ఈ క్రమంలోనే ‘మరొక్కసారి’ అంటూ సాగే ఫీల్ గుడ్, లవ్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు తిరుపతి జవ్వాన సాహిత్యం అందించగా, పీఆర్ (పెద్దపల్లి రోహిత్) బాణీ సమకూర్చారు. ఇక మెలోడీ పాటలకు కేరాఫ్ అడ్రస్ అయిన సింగర్ కార్తీక్ గాత్రం ఈ పాటను మరో స్థాయికి తీసుకు వెళ్లాయి.

‘మరొక్కసారి’ అంటూ సాగే ఈ పాట లిరికల్ వీడియో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. కొరియోగ్రాఫర్ విష్ణు ప్రెజర్వర్ కంపోజ్ చేసిన హుక్ స్టెప్ కూడా బాగుంది. లీడ్ పెయిర్ ఫ్రెష్‌గా కనిపిస్తున్నారు. గ్రామీణ వాతావరణాన్ని ఈ పాటలో చక్కగా చూపించారు. ఇదొక విలేజ్, లవ్, కామెడీ ఎంటర్టైనర్‌గా రాబోతోందని పాటని చూస్తే అర్థం అవుతోంది. త్వరలోనే మేకర్స్ ఈ సినిమాకి సంబంధించిన రిలీజ్ డేట్‌ని ప్రకటించనున్నారు. ఈ ‘చీన్ టపాక్ డుండుం’ మూవీకి సెంథిల్ కుమార్ కెమెరామెన్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. పీఆర్ పాటలకు సంగీతం అందిస్తుండగా.. సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు.

ప్రియుడితో వివాహబంధంలోకి
మృణాళిని రవి

వరుణ్ తేజ్ హీరోగా వచ్చిన ‘గద్దలకొండ గణేష్’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరై, ఆ తర్వాత ‘ఎనిమీ’, ‘కోబ్రా’, ‘ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు’, ‘మామా మశ్చీంద్ర’ వంటి చిత్రాలతో టాలీవుడ్, కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ మృణాళిని రవి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, ప్రేమికుడు మహావిష్ణును ఆమె వివాహం చేసుకున్నారు. కొద్ది నెలల క్రితమే మహావిష్ణుతో తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన మృణాళిని, తాజాగా ఆయనతో కలిసి ఏడడుగులు వేశారు.

మలేషియాలోని ప్రముఖపర్యాటక ద్వీపమైన లంకావి వేదికగా ఈ నెల 15న వీరి వివాహ వేడుక అత్యంత సన్నిహితులు, ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా జరిగింది. పెళ్లి వేడుకకు సంబంధించిన అత్యంత మధురమైన క్షణాలను మృణాళిని రవి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. లేత గులాబీ రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మృణాళిని పెళ్లికూతురిగా మెరిసిపోతుండగా.. క్రీమ్ కలర్ పట్టు పంచె, కుర్తాలో వరుడు మహావిష్ణు ఎంతో హుందాగా కనిపించారు. మంగళసూత్ర ధారణ సమయంతో పాటు నుదుట సిందూరం దిద్దుతున్న ఆత్మీయ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి.



సాయిపల్లవి అంకితభావం



సాయిపల్లవి మరోసారి తన నటనతో పాటు అంకితభావంతో వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్న ‘ఓ.ఎం.(ఆపరేషన్ మోల్)’ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఐపీఎస్ అధికారిణి నిత్యా రెడ్డి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు మరింత సహజత్వం తీసుకొచ్చేందుకు సాయిపల్లవి ఏకంగా తన జుట్టునే కత్తిరించుకున్నారట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించిన ఆమె.. తన షార్ట్ హెయిర్ చూసి తల్లిదండ్రులు ఆశ్చర్యపోయిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు.

జుట్టు కత్తిరించుకున్న తర్వాత మా అమ్మకు వీడియో కాల్ చేశాను.నా కొత్తలుక్ చూసి ఆమె ఒక్కసారిగా షాక్ అయ్యారు. కోపంతో వెంటనే కాల్ కట్ చేశారు. ఆ తర్వాత మా నాన్నకు ఫోన్‌చేసి మాట్లాడితే.. విగ్ పెట్టుకున్నావా అని అడిగారు. నిజంగానే జుట్టు కత్తిరించుకున్నానని చెప్పడంతో ఆయన కూడా ఆశ్చర్యపోయారు. అమ్మకు ఈ విషయం అర్థమ య్యేలా చెప్పడానికి నాన్న కొన్ని రోజులు ప్రయత్నించాల్సి వచ్చింది. చాలా రోజుల తరు వాత కోపం తగ్గిన అమ్మ మళ్లీ నాతో మాట్లాడారని సాయిపల్లవి తెలిపారు. అయితే జుట్టు కత్తి రించుకునేందుకు తాను వెంటనే అంగీకరించలేదని ఆమె తెలిపారు. మరో దర్శకుడు అడిగి ఉంటే ఇంతచిన్న జుట్టుతో కని పించడానికి ఒప్పుకునేదాన్ని కాదేమో. కానీ ‘అమరన్’ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియ సామి అడగడంతో కాదనలేక పోయానని వివరించారు.

రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ మమ్ముట్టి మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. నవంబరు 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత ఈ చిత్రానికి ‘ఓం’ అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. సెన్సార్ బోర్డు సూచనల మేరకు ‘ఓ.ఎం.(ఆపరేషన్ మోల్)’గా మార్చారు.